నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 8-9-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 32 | పేజిలు: 4 | వెల: రూ.1/-

భారీ వర్షాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష

హైదరాబాద్, జులై 7:తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, ప్రస్తుత పరిస్థితులపై ఢిల్లీ నుంచి సీఎం కేసీఆర్ సమీక్షించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి పలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు, పూర్తి ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపట్టాలని సీఎస్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

భారీ వానల వల్ల వాగులు వంకలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ఆయా గ్రామాలు మండలాల్లోని ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆయా శాఖల ఉద్యోగులను అప్రమత్తం చేయాలన్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానల వల్ల గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ప్రభావితమయ్యే విద్యుత్తు, రోడ్లు, నాలాలు తదితర రంగాల పరిస్థితుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, రోడ్లు భవనాల శాఖ, విద్యుత్ శాఖల అధికారులు కింది స్థాయి వరకు తమ ఉద్యోగులను అప్రమత్తం చేయాలన్నారు.

నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తం కావాలి

భారీ ఎత్తున వరద పోటెత్తడంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులు, చెరువులు కుంటలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తం కావాలని సీఎం ఆదేశించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడుతూ వరద ముంపు ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టాలని సీఎస్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , సెప్టెంబర్ 7:రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని రాష్ట్ర పురపాలక, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. చేనేత, జౌళీ రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలు, కార్యక్రమాలు.. వాటి అమలుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో చేనేత కార్మికులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన పలు అంశాలపై గత నెలలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, చేనేత జౌళీశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ సమీక్షించిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో భాగంగా తీసుకున్న నిర్ణయాలపై ఇవాళ మరోసారి సమీక్ష నిర్వహించి, చేనేత కార్మికుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత కార్మికులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన పలు అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకున్నారు.

సమీక్షలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పేరెన్నికగన్న చేనేత రంగాన్ని సంస్థాగతంగా, నిర్మాణాత్మకంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం వివిధ రాష్ట్ర ప్రాయోజిత పథకాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. అనేక వినూత్న కార్యక్రమాల ద్వారా నేత కార్మికులు, అనుబంధ కార్మికుల నెలవారి ఆదాయాన్ని పెంపొందించి.. జీవన ప్రమాణాలను అభివృద్ధి పరచడం జరుగుతుందన్నారు.

చేనేత సహకార సంఘాలకు 20శాతం హాంక్ నూలు, రంగులు సబ్సిడీ పథకం కింద నిధుల విడుదల, చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన పావలావడ్డీ పథకం, సంఘాలకు చెల్లించాల్సిన మార్కెటింగ్ ప్రోత్సాహక పథకం కింద నిధుల విడుదల, టెస్కో ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు, చేనేత సహకార సంఘాలకు టెస్కో చెల్లించాల్సిన నిధులు, చేనేత మిత్ర పథకం ద్వారా కార్మికులకు సబ్సిడీ నిధుల, క్యాష్ క్రెడిట్ రుణాల చెల్లింపు, త్రిఫ్టు ఫండ్ పథకం పునః ప్రారంభం తదితర అంశాలపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

చేనేత, జౌళీశాఖ అధికారులతో పథకాల వారీగా సమీక్షించి, ప్రభుత్వం ద్వారా చేనేత కార్మికుల సంక్షేమానికి వారు తమ దృష్టికి తీసుకొచ్చిన అంశాలను సంపూర్ణంగా ఆమోదిస్తూ, ఆయా పథకాల అమలుకు సంబంధించిన నిధులను విడుదల చేయడం జరిగిందన్నారు.

ఇందుకు సంబంధించి రూ.73.50కోట్ల నిధులు విడుదల చేసినట్లు మంత్రి వివరించారు. ఆయా సంఘాలు, కార్మికులకు తక్షణం నిధులు విడుదల చేసేందుకు శాఖాపరమైన అన్ని చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

పథకాలు అమలతో చేనేత కార్మికుల తలసరి ఆదాయం పెరుగడంతో పాటు చేనేత కార్మికులకు 365 దినాలు సంపూర్ణంగా పని కల్పించేందుకు మార్గం సుగమమవుతుందన్నారు.

అలాగే సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు చేనేత కార్మికుల నెలసరి ఆదాయం కనీసం రూ.15000లకు మించి పొందడానికి ఆస్కారం ఏర్పడిందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ విజన్ మేరకు రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కేటీఆర్ పునరుద్ఘాటించారు.

పర్యావరణం, అటవీ సంరక్షణే ధ్యేయం : మంత్రి ఐకే రెడ్డి

హైదరాబాద్ , సెప్టెంబర్ 7: పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణ, అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. అటవీ, పర్యావరణ అధ్యక్షతన మంగళవారం అరణ్య భవన్‌లో రాష్ట్ర వన్యప్రాణి మండలి సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో అభయారణ్యాల్లో రహదారుల నిర్మాణాలు, వన్యప్రాణుల ఆవాసాలుకు అడ్డు రాకుండా స్వేచ్ఛగా సంచరించేందుకు అండర్ పాస్‌ల ఏర్పాటుపై రాష్ట్ర వన్యప్రాణి మండలి ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ. శాంతికుమారి, అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) ఆర్. శోభ, బోర్డు సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యే కోనప్ప, ఆసిఫాబాద్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ కోవా లక్ష్మి, ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ ప్రాంతాల్లో త్వరితగతిన రహదారుల నిర్మాణం చేపట్టేలా అటవీ శాఖ అధికారుల్కు, ఇతర శాఖల సమన్వయంతో వెంటనే అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పెండింగ్ లో ఉన్న ప్రతిపాదనలు కూడా వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, దీంతో వన్య ప్రాణుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. హరితహారంతో తెలంగాణ అంతటా పచ్చదనం పరుచుకుందని తెలిపారు.

ప్రత్యర్థుల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాలి : కేటీఆర్

హైదరాబాద్ , సెప్టెంబర్ 7: తెలంగాణలోని ప్రతిపక్ష పార్టీల నాయకులపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇవాళ కొంత మంది ఎగిరెగిరి పడుతున్నారు. టీ కాంగ్రెస్, టీ బీజేపీ.. కేసీఆర్ పెట్టిన భిక్ష కాదా మీకు పదవులు వచ్చాయంటే కేసీఆర్ పెట్టిన భిక్ష కాదా? అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మిమ్మల్ని ఎవరు పట్టించుకోలేదు. ఇప్పుడు కేసీఆర్ పుణ్యమా అని పదవులు రాగానే.. గంజిలో ఈగల్లాగా ఎగిరిపడుతున్నారు అని ఎద్దేవా చేశారు. చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. వయసులో మీ కంటే 20 ఏండ్ల పెద్ద మనిషిని పట్టుకుని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. నిన్న మొన్న పుట్టిన చిల్లరగాళ్లు ఎగిరెగిరి పడుతున్నారు. పేరుకే ఢిల్లీ పార్టీలు కానీ.. చేసేవి మాత్రం చిల్లర పనులు అని ధ్వజమెత్తారు. ప్రత్యర్థుల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని టీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. జల విహార్‌లో జీహెచ్ఎంసీకి చెందిన టీఆర్ఎస్ పార్టీ నాయకులతో కేటీఆర్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 60 లక్షల పైచిలుకు సభ్యులతో టీఆర్ఎస్ పార్టీ బలంగా ఉంది. 33 జిల్లాల్లో జిల్లా పార్టీ కార్యాలయాలు కట్టుకున్నాం. మొన్న ఢిల్లీలో తెలంగాణ భవన్‌కు భూమిపూజ చేసుకున్నాం. ఇప్పుడు మన ముందు ఏ ఎన్నిక లేదు. హుజూరాబాద్ ఎన్నిక సమస్యనే కాదు. ప్రత్యర్థుల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది. దాని కోసం సైన్యం ఉంటే సరిపోదు. ఇందుకు ఎక్కడికక్కడ కమిటీలు పటిష్టంగా ఉండాలి. జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చే నియోజకవర్గాల్లో పార్టీ కమిటీలు ఏర్పాటు చేసి ముందుకెళ్లాలి. గ్రేటర్ పరిధిలో 4,800 దాకా కాలనీ అసోసియేషన్‌లు ఉన్నాయి. 1486 నోటిఫైడ్ బస్తీలు ఉన్నాయి. మొత్తం కలిపి 6,300 దాకా కాలనీలు, బస్తీలు ఉన్నాయి. డివిజన్లతో పాటు వీటికి కూడా కమిటీలు వేసుకోవాలి. సెప్టెంబర్ 29వ తేదీ లోపు బస్తీ, కాలనీ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. ఈ కమిటీలో 15 మందికి తగ్గకుండా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. డివిజన్ స్థాయిలో 150 డివిజన్ కమిటీలు వేసుకోవాలి. ఈసారి జిల్లా కమిటీలు వేసుకోవాలని కేసీఆర్ చెప్పారు అని కేటీఆర్ వెల్లడించారు.

బరాబర్ సమాధానం చెప్తాం

70 ఏండ్లలో ఈ తెలంగాణ ప్రజలకు కరెంట్, తాగునీరు ఇవ్వలేని దౌర్భాగ్యం మీది. 24 గంటల కరెంట్ తీసుకొచ్చింది కేసీఆర్ కాదా? నల్లగొండలో ఫ్లోరోసిస్ లేదని కేంద్రమే పార్లమెంట్‌లో చెప్పింది.. అది తెలంగాణకు గర్వకారణం కాదా? అని కేటీఆర్ అడిగారు. తెలంగాణ రైతులు సుభిక్షంగా ఉంటే.. ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. కేసీఆర్‌పై అవాకులు చవాకులు పేలితే బరాబర్ సమాధానం చప్తాం. కుక్క కాటు చెప్పు దెబ్బ తప్పదు. ఓపిక పట్టినం.. సైలెంట్‌గా ఉండే కొద్ది మాటలు ఎక్కువైతున్నాయి అని కేటీఆర్ మండిపడ్డారు.

గల్లీ టు ఢిల్లీ.. గులాబీ జెండాకే జై

గల్లీ టు ఢిల్లీ గులాబీ జెండాకే జైకొడుతున్నారు. 2014లో 63 సీట్లు, ఆ తర్వాత వచ్చిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో 12769 గ్రామ పంచాయతీలకు గానూ.. 10 వేల గ్రామాల్లో గులాబీ జెండాలు ఎగిరాయి. జిల్లా పరిషత్ ఎన్నికల్లోనూ 32 జడ్పీలను కైవసం చేసుకున్నాం. మళ్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 88 స్థానాల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించారు. కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచారు. పార్లమెంట్ ఎన్నికల్లో 9 సీట్లను కట్టబెట్టారు. 142 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగితే.. 135 మున్సిపాలిటీల్లో గులాబీ జెండాను రెపరెపలాడించారు. ఈ ఏడేండ్లలో టీఆర్ఎస్ పార్టీ ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. పత్రికల్లో హెడ్‌లైన్స్ కోసం, పైశాచిక ఆనందం కోసమే ప్రతిపక్షాలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. వారిని ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదు అని కేటీఆర్ పేర్కొన్నారు.

త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

పార్టీలో క్రియాశీలకంగా పని చేసిన వారిని తప్పకుండా గౌరవించుకుంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. పదవులు రాక కొంత మంది నిరాశతో ఉన్నారు. తొందర్లోనే 500 నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తాం. జీహెచ్ఎంసీ పరిధిలో కో ఆప్షన్ సభ్యులను నియామకం కూడా పూర్తి చేస్తాం. పార్టీ గౌరవాన్ని పెంచే విధంగా పని చేయాలి. బస్తీ, డివిజన్ కమిటీలకు ఇచ్చే ప్రాధాన్యతను సోషల్ మీడియా కమిటీలకు ఇవ్వాలి. సోషల్ మీడియా కమిటీలకు కూడా శిక్షణ ఇవ్వాలి. ఇతర ఏ పార్టీకి లేని విధంగా ఒక కార్యాలయాన్ని నిర్మాణం చేసుకుందామని కేటీఆర్ తెలిపారు. దసరా, దీపావళి తర్వాత కమిటీలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి.. ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు కేటీఆర్.

తెలంగాణలో వర్ష బీభత్సం.. సిరిసిల్ల జలమయం

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 7:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణలో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వరదలు పోటెత్తాయి. పలు పట్టణాలు, కాలనీలు, గ్రామాలు జలమయం అయ్యాయి. వాగులు, చెరువులు పొంగిపొర్లడంతో రహదారులు తెగిపోయాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల అయితే ఇండ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో.. బియ్యంతో సహా ఇతర వస్తువులు పూర్తిగా తడిసిపోయాయి.

సిరిసిల్లలో భారీ వర్షం కురిసింది. పట్టణానికి వరద పోటెత్తింది. భారీ వరదతో సిరిసిల్లలో జనజీవనం స్తంభించిపోయింది. సిరిసిల్లలోని పలు కాలనీలో వరద నీరు చేరడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మోకాళ్ల లోతుకు పైగానే వరద ప్రవాహం కొనసాగుతోంది. కొన్ని కాలనీల్లో కార్లు కూడా వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. పాతబస్టాండ్, ప్రగతి నగర్, సాయినగర్, వెంకంపేట, శాంతి నగర్, పద్మానగర్ ఏరియాల్లో ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. అంబికానగర్, శాంతి నగర్, గాంధీనగర్‌లో వరద పోటెత్తింది. పెద్ద బజార్, అంబేద్కర్ నగర్ ప్రాంతాలు జలమయం అయ్యాయి. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆయా కాలనీల వాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొత్త కలెక్టరేట్ ప్రాంగణాన్ని వరదనీరు ముంచెత్తింది. ఉదయం నుంచి ఒక్కరూ బయటకు వచ్చే పరిస్థితి లేదు.

సిరిసిల్ల పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సిరిసిల్లలోని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. సహాయక చర్యల కోసం కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను అప్రమత్తం చేశారు. 24 గంటలూ అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల పట్టణంలో భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు మరియు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల నిమిత్తం కంట్రోల్ రూమ్ నెంబర్ 9100069040 ఏర్పాటు చేశారు. కావున ఎలాంటి సహాయం కావలసి ఉన్న ఈ నెంబర్‌కు కాల్ చేయొచ్చు.

ఆన్‌లైన్ ఆడిటింగ్‌లోనూ తెలంగాణే నంబర్ వన్ : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ , సెప్టెంబర్ 7: కేంద్రం నిర్వహించిన ఆన్‌లైన్ ఆడిటింగ్‌లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందంటూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ఆడిటింగ్‌లో తెలంగాణ నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిన నేపథ్యంలో మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిధుల వినియోగం, ఖర్చు ఏ విధంగా ఉందనే విషయాలను తెలుసుకునేందుకు కేంద్రం ఆడిటింగ్ నిర్వహిస్తుందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సమానంగా నిధులు ఇస్తున్న రాష్ట్రం ఏకైక రాష్ట్రం తెలంగాణ తప్ప దేశంలో మరొకటి లేదన్నారు.

ఈ ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. అన్ని గ్రామాలను ఆడిటింగ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం గతేడాది నిర్ణయించిందని, ఆ ఏడాది 25శాతం ఆడిటింగ్ జరిగినా చాలని కేంద్రం భావించిందని, అయితే తెలంగాణలో 40శాతం మేర గ్రామాల ఆడిటింగ్‌ను అధికారులు పూర్తి చేశారని మంత్రి తెలిపారు. దీంతో వలు రాష్ట్రాలు తెలంగాణకు వచ్చి ఆడిటింగ్‌పై అధ్యయనం చేసి వెళ్లాయన్నారు. అయినా, కొన్ని రాష్ట్రాలు ఆడిటింగ్‌ను కనీసం మొదలు పెట్టలేకపోయాయని, దీంతో కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించిందని మంత్రి తెలిపారు.

సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో ఆడిటింగ్‌లో అనుసరించిన విధి విధానాలపై మన అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ కూడా ఇచ్చారన్నారు. అయితే కరోనా ప్రభావం ఉన్నప్పటికీ ఈ ఏడాది జూన్‌లోనే ఆడిటింగ్‌ను మొదలు పెట్టడంతో కేవలం మూడు నెలల్లోనే 28శాతం ఆడిటింగ్ పూర్తి చేసి, దేశంలో మరోసారి మొదటి స్థానంలో నిలిచామని మంత్రి వివరించారు. తండాలను సైతం పంచాయతీలుగా మార్చిన సీఎం కేసీఆర్ నిధులను క్రమం తప్పకుండా పంచాయతీలకు విడుదల చేస్తున్నారన్నారు. దీంతో ప్రతి చిన్న చిన్న గ్రామ పంచాయతీకి కూడా కనీసం నిధులు సమకూరి అభివృద్ధి జరిగే అవకాశం ఉందన్నారు.

కొత్త పంచాయతీరాజ్ చట్టం ద్వారా అభివృద్ధి పనుల నిర్ణయం, ఖర్చు స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా గ్రామ పంచాయతీలకే ఇవ్వడం, అలాగే.. ఆయా పనులు ప్రయోజనకరంగా, నిధుల దుర్వినియోగం జరగకుండా, పారదర్శకంగా జరిగే విధంగా చూడడంతో రాష్ట్రంలో స్థానిక పరిపాలన అద్భుతంగా కొనసాగుతుందని మంత్రి చెప్పారు. పల్లె ప్రగతి సాధించిన ఫలితాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇదే క్రమంలో నిర్వహిస్తున్న ఆడిట్‌లోనూ మన రాష్ట్రం దేశంలో నెంబర్ వన్‌గా నిలిచామంటూ సీఎం కేసీఆర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

'శిక్షక్‌పర్వ్' విద్య రంగంలో అనేక మహత్వపూర్ణ పథకాలను ప్రారంభించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:'శిక్షక్ పర్వ్' తాలూకు ప్రారంభ సదస్సు ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ప్రసంగించారు. ఆయన భారతీయ సంజ్ఞా భాషా నిఘంటువు (వినికిడి లోపం ఉన్నవారి కి యూనివర్సల్ డిజైన్ ఆఫ్ లెర్నింగ్ కు అనుగుణం గా ఆడియో మరియు టెక్స్ట్ ఎంబెడెడ్ సంజ్ఞ భాష వీడియో) ను, మాట్లాడే పుస్తకాలు (దృష్టి లోపం ఉన్నవారి కోసం రూపొందినటువంటి ఆడియో బుక్స్) ను, సిబిఎస్ఇ యొక్క స్కూల్ క్వాలిటీ అశ్యోరెన్స్ ఎండ్ అసెస్ మెంట్ ఫ్రేమ్ వర్క్ ను, 'నిపుణ్ భారత్' కు ఉద్దేశించినటువంటి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం అయిన 'నిష్ఠ' ను, విద్యాంజలి పోర్టల్ ను (పాఠశాల అభివృద్ధి కి విద్య వాలంటియర్ లు/ దాతలు/ సిఎస్ఆర్ సహకారాన్ని సులభతరం చేయడం కోసం ఉద్దేశించింది) కూడా ప్రారంభించారు.

మంత్రి ఈ సందర్భం లో సభ ను ఉద్దేశించి ప్రసంగిస్తూ, జాతీయ పురస్కారాల ను అందుకొన్న గురువుల కు అభినందన లు తెలిపారు. కష్ట కాలాల్లో దేశం లో విద్యార్థుల భవిష్యత్తు ను దిద్ది తీర్చడానికి ఉపాధ్యాయులు అందించిన తోడ్పాటు ను ఆయన ప్రశంసించారు. ఈ రోజు న 'శిక్షక్ పర్వ్' సందర్భం లో అనేక కొత్త పథకాల ను మొదలుపెట్టుకోవడం జరిగింది. దేశం ప్రస్తుతం 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' ను జరుపుకొంటూ స్వాతంత్ర్యం వచ్చిన 100 సంవత్సరాల కు భారతదేశం ఏ విధం గా ఉండాలి అనే అంశం లో కొత్త సంకల్పాల ను తీసుకొంటున్న నేపథ్యం లో ఆ పథకాలు మహత్వపూర్ణమైన పథకాలు అని ఆయన అన్నారు. మహమ్మారి రువ్విన సవాలు కు స్పందించినందుకు విద్యార్థుల ను, ఉపాధ్యాయుల ను, యావత్తు విద్య రంగ సముదాయాన్ని మంత్రి మెచ్చుకొని, ఆ కష్ట కాలాన్ని తట్టుకొని నిలబడటానికి వీలు గా అభివృద్ధి పరచిన సామర్థ్యాల ను మరింతగా ముందుకు తీసుకుపోవలసిందిగా వారిని కోరారు. "మనం ఒక పరివర్తన దశ లో ఉన్నాం అని భావించినట్లయితే గనక, అదృష్టవశాత్తు మనకు అండ గా ఒక ఆధునికమైనటువంటి, భవిష్యత్ దర్శనం కలిగినటువంటి నూతన జాతీయ విద్య విధానం ఉంది" అని ఆయన అన్నారు.

జాతీయ విద్య విధానం రూపకల్పన లో, మరి అలాగే ఆ విధానం అమలు లో ప్రతి ఒక్క స్థాయి లో గురువులు, నిపుణులు, విద్య రంగ పండితుల తోడ్పాటు లభించిందంటూ ప్రధాన మంత్రి ప్రశంసించారు. ఈ భాగస్వామ్యాన్ని ఒక కొత్త స్థాయి కి తీసుకుపోవాలని, అలాగే దీని అమలు లో సమాజం పాలుపంచుకొనేటట్లుగా చేయాలని ప్రతి ఒక్కరి కి ఆయన విజ్ఞప్తి చేశారు. విద్య రంగం లో ఈ పరివర్తన లు ఒక్క విధానం ఆధారితమైనవి మాత్రమే కాదు, కానీ ప్రాతినిధ్యం ఆధారితమైనవి కూడాను అని ఆయన అన్నారు.

'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' కు జత గా 'సబ్ కా ప్రయాస్' అనేటటువంటి దేశం సంకల్పాని కి 'విద్యాంజలి 2.0' ఒక వేదిక మాదిరి గా పని చేస్తుంది అని ప్రధాన మంత్రి అన్నారు. దీనికోసం సమాజం లో, మన ప్రైవేటు రంగం ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో విద్య తాలూకు నాణ్యత ను పెంచడంలో తోడ్పడి తీరాలి అని ఆయన అన్నారు.

కొన్ని సంవత్సరాల లో ప్రజల భాగస్వామ్యం అనేది మరో మారు భారతదేశం యొక్క జాతీయ స్వభావం గా మారుతోంది అని ప్రధాన మంత్రి చెప్పారు. గత 6-7 సంవత్సరాల లో ప్రజల భాగస్వామ్యం తాలూకు సామర్థ్యం కారణం గా భారతదేశం లో ఇదివరకు ఊహించడానికైనా కష్టం గా తోచినటువంటి అనేక కార్యాల ను పూర్తి చేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఏదైనా కార్యాన్ని సమాజం కలసికట్టు గా చేసినప్పుడు, ఆశించిన ఫలితాలు అందడం తథ్యం అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు, వారు జీవనం లో ఏ రంగాని కి చెందిన వారు అయినప్పటికీ, యువత భవిష్యత్తు ను మలచడం లో ఒక పాత్ర ను కలిగి ఉంటారు అని ప్రధాన మంత్రి అన్నారు. ఇటీవలే ముగిసిన ఒలింపిక్స్ లోను, పారాలింపిక్స్ లోను మన క్రీడాకారులు, క్రీడాకారిణులు గొప్ప గా రాణించారు అని ఆయన గుర్తు కు తెచ్చారు. ఆటగాళ్ళ లో ప్రతి ఒక్కరు 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కాలం లో కనీసం 75 పాఠశాల లను సందర్శించాలి అంటూ తాను చేసిన విన్నపాన్ని మన్నించినందుకు ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులు, అనేక మంది ప్రతిభావంతులు ప్రేరణ ను పొందేటట్లు చేస్తుంది, క్రీడల రంగం లో ముందడుగు వేయడం కోసం వారికి ప్రోత్సాహం అందుతుంది అని ఆయన అన్నారు.

దేశం అయినా ప్రగతి ని సాధించాలి అంటే విద్య కేవలం అందరినీ కలుపుకుపోయేది గా ఉండటమే కాకుండా, అందరికీ సమానమైన విద్యార్జన అవకాశాలు కూడా లభించాలి అని ప్రధాన మంత్రి అన్నారు. నేశనల్ డిజిటల్ ఆర్కిటెక్చర్ ('ఎన్-డిఇఎఆర్'.. 'ఎన్- డియర్') అనేది విద్య లో, విద్య ఆధునికీకరణ లో అసమానత ల నిర్మూలన లో ఒక ప్రధాన పాత్ర ను పోషించే అవకాశం ఉంది అని కూడా ఆయన అన్నారు. బ్యాంకింగ్ రంగాన్ని యుపిఐ ఇంటర్ ఫేస్ విప్లవాత్మకమైన మార్పుల కు బాట ను పరచిన విధంగానే అనేక విద్యా సంబంధ కార్యకలాపాల మధ్య ఒక 'సూపర్-కనెక్ట్' గా ఎన్- డియర్ ఉంటుంది అని ప్రధాన మంత్రి అన్నారు. టాకింగ్ బుక్స్, ఆడియో బుక్స్ వంటి సాంకేతికత ను విద్య లో ఒక భాగం గా దేశం ప్రవేశపెట్టుకొంటోంది అని ఆయన వివరించారు.

పాఠ్య క్రమం, విద్య ను బోధించేటటువంటి కళ, మూల్యాంకనం, మౌలిక సదుపాయాలు, అన్ని వర్గాల ను కలుపుకొని పోయేటటువంటి అభ్యాసాలు, పాలన ప్రక్రియ వంటి పార్శ్వాల లో ఒక సామాన్నయ శాస్త్రీయ ఫ్రేమ్ వర్క్ లోపించడం అనేటటువంటి కొరత ను ఈ రోజు న మొదలుపెట్టిన స్కూల్ క్వాలిటీ అసెస్‌మెంట్ ఎండ్ ఎశ్యోరెన్స్ ఫ్రేమ్ వర్క్ (ఎస్.క్యు.ఎ.ఎ.ఎఫ్) పరిష్కరిస్తుంది. ఈ అసమానత ను తొలగించడంలో ఎస్ క్యుఎఎఎఫ్ తోడ్పడుతుందని ఆయన అన్నారు.

శర వేగం గా మార్పుకు లోనవుతున్న ప్రస్తుత యుగం లో మన గురువు లు సైతం కొత్త కొత్త వ్యవస్థల ను, మెలకువల ను అంతే వేగం గా నేర్చుకోవాలి అని ప్రధాన మంత్రి అన్నారు. దేశం ఈ విధమైన మార్పుల ను దృష్టి పెట్టుకొని 'నిష్ఠ' శిక్షణ కార్యక్రమాల ద్వారా తన గురువుల ను సన్నద్ధం చేస్తోంది అని ఆయన వెల్లడించారు.భారతదేశం లో గురువు లు ఏ ప్రపంచ ప్రమాణాన్ని అయినా సరే అందుకోవడమే కాకుండా వారివద్ద వారిదైన ఒక ప్రత్యేకమైన పెట్టుబడి కూడా ఉంటుంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ ప్రత్యేకమైన పెట్టుబడి ,ఈ విలక్షణమైన బలం ఏమిటి అయ్యా అంటే అవి వారి లో అంతర్గతం గా ఇమిడిపోయి ఉన్నటువంటి భారతీయ సంస్కృతే అని ఆయన చెప్పారు. మన ఉపాధ్యాయులు వారి పని ని అది ఒక వృత్తి అని మాత్రమే ఎంచరు, బోధన అనేది వారికి ఒక మానవీయ సహానుభూతి, ఒక పవిత్రమైన నైతిక కర్తవ్యం గా దానిని వారు చూస్తారు అని ఆయన అన్నారు. ఈ కారణం గా మన దేశం లో గురువు కు, బాలల కు మధ్య ఒక వృత్తిపరమైన సంబంధాన్ని మాత్రమే కాకుండా ఒక కుటుంబిక అనుబంధం ఉంటుంది, మరి ఈ అనుబంధం జీవన పర్యంతం కొనసాగుతుంది అని ప్రధాన మంత్రి చెప్పారు.

స్కూల్ టీచర్, ఆమె కొడుకు దారుణహత్య.. కిచెన్‌లోని కత్తితో పొడిచి చంపిన దుండగులు..!

కోల్‌కతా, సెప్టెంబర్ 7:: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో దారుణం జరిగింది. బెహాలా పర్నశ్రీ ఏరియాలోగల ఓ బహుళ అంతస్తుల భవనంలోని ఫ్లాట్‌లో ఒక స్కూల్ టీచర్, ఆమె 14 ఏండ్ల కొడుకు సోమవారం సాయంత్రం దారుణహత్యకు గురయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు వాళ్లను కిరాతకంగా హత్యచేశారు. భర్త విధుల నుంచి ఇంటికి తిరిగి వచ్చేసరికి భార్య, కొడుకు ఇద్దరూ రక్తపు మడుగులో పడివున్నారు. దాంతో మృతురాలి భర్త వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి మృతురాలి భర్తను, వారింటికి రోజూ వచ్చే ట్యూషన్ మాస్టర్‌ను పోలీసులు విచారించారు. తాను ఆఫీస్ నుంచి వచ్చే సరికి ఇంటి తలుపులు తీసి ఉన్నాయని, తన కొడుకు బెడ్‌పై రక్తపు మడుగులో పడి ఉన్నాడని, తన ఒంటిపై స్కూల్ యూనిఫాం, టై, బెల్ట్ కూడా అలాగే ఉన్నాయని చెప్పాడు. తన భార్య బెడ్ పక్కనే ఫ్లోర్‌పై రక్తపు మడుగులో పడి ఉందన్నాడు. తాను సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ట్యూషన్ చెప్పేందుకు వెళ్లేసరికి ఇంటి తలుపులు మూసి ఉన్నాయని, లోపల లైట్‌లు కూడా ఆఫ్ చేసి ఉన్నాయని, దాంతో వాళ్లు ఇంట్లో లేరని భావించి తిరిగి వెళ్లిపోయానని ట్యూషన్ మాస్టర్ చెప్పాడు. ఇరుగుపొరుగును విచారించగా.. సోమవారం సాయంత్రం తమకు ఎలాంటి అనుమానాస్పద దృశ్యాలు కనిపించలేదన్నారు. పోస్టు మార్టం రిపోర్టు వస్తే ఏమైనా క్లూ దొరికే అవకాశం ఉన్నదని, తమ తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

చరిత్రలో నేటినిజం

కొలచెద- సంగీతమున
విలువలకై పోటుపడిన విమలాత్ముని
తులలేని"చక్రవర్తి"గ
నల ఇచ్చిన"కొమ్మనేని అప్పారావు"నే !!

(సెప్టెంబర్ 8 సంగీత దర్శకుడు చక్రవర్తి జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210



సిరిసిల్లలో భారీ వర్షం.. మంత్రి కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్

హైదరాబాద్ , సెప్టెంబర్ 7:సిరిసిల్ల పట్టణంలో నిన్న రాత్రి భారీ వర్షం కురియడంతో వరద పోటెత్తిన విషయం తెలిసిందే. పలు కాలనీల్లో వరద నీరు వచ్చి చేరింది. పట్టణంలో వరద ఉధృతిపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్‌లతో మంత్రి కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సిరిసిల్ల పట్టణానికి వరద నీరు వచ్చి కాలనీల్లో చేరుతున్న దృష్ట్యా సహాయక చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా యంత్రాగాన్ని మంత్రి కేటీఆర్ ఆదేశించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. వరద ముంపునకు గురైన ప్రజలను పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తరలించాలని సూచించారు. సహాయక చర్యల కోసం హైదరాబాద్ నుంచి డీఆర్ఎఫ్ బృందాన్ని పంపిస్తున్నామని తెలిపారు. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, అన్ని విధాలుగా సహాయక చర్యలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని మంత్రి కేటీఆర్ తెలిపారు

వెంకన్న భక్తులకు శుభవార్త.. రేపటి నుంచి సర్వదర్శనం టోకెన్ల జారీ..

తిరుమల, సెప్టెంబర్ 7: : కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం శుభవార్త చెప్పింది. బుధవారం నుంచి సర్వదర్శనం టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలిపింది. గత కొద్ది రోజులుగా సర్వదర్శనం టోకెన్లు జారీ చేయాలని భక్తుల నుంచి వస్తున్న విజ్ఞప్తి మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. బుధవారం ఉదయం 6 గంటల నుంచి రోజుకు రెండువేల చొప్పున సర్వదర్శనం టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్‌లోని టోకెన్లు జారీ చేస్తారని టీటీడీ పేర్కొంది. అయితే, ప్రయోగాత్మకంగా చిత్తూరు జిల్లాకు చెందిన భక్తులకు మాత్రమే ఈ అవకాశం కల్పించినట్లు చెప్పింది.

భక్తులు కొవిడ్ నిబంధనలు పాటిస్తూ టోకెన్లు పొందేందుకు సహకరించాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కరోనా సెకండ్ వేవ్ నేపథ్యంలో దేవస్థానం సర్వదర్శనం టోకెన్ల జారీ నిలిపి వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెన్లను మాత్రమే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి మాత్రమే స్వామివారి దర్శనం కల్పిస్తోంది. చాలా రోజులుగా సామాన్య భక్తులు స్వామి వారి దర్శనం కోసం పడిగాపులు పడుతున్నారు. సర్వదర్శనం టోకెన్లు జారీ చేయాలని కోరుతూ వస్తున్నారు. ప్రస్తుతం సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తుండడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణలో మరో మూడు రోజులు వానలు

హైదరాబాద్ , సెప్టెంబర్ 7: రాష్ట్రంలో వర్షాలు దంచికొడుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి.

లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో మరో మూడు రోజులు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనం కొనసాగుతుందని పేర్కొంది.

అల్పపీడనానికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఉందని తెలిపింది. పశ్చిమ, వాయువ్య దిశగా అల్పపీడనం ప్రయాణించే అవకాశం ఉందని చెప్పింది. అలాగే ఈ నెల 11న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే సూచనలున్నాయని పేర్కొంది. వీటి ప్రభావంతో మంగళ, బుధ, గురువారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వానలు పడుతాయని చెప్పింది.

వర్షాలు, వరదలపై కలెక్టర్లతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్

హైదరాబాద్ , సెప్టెంబర్ 7: రాష్ట్రంలో వర్షాలు, వరదలపై కలెక్టర్లతో సీఎస్ సోమేశ్‌కుమార్ సమీక్షించారు. 20 జిల్లాల కలెక్టర్లతో పరిస్థితిపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులు, సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. పరిస్థితి ఎప్పటికప్పుడు సీఎం సమీక్షిస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

చెరువులు, కుంటలు, జలాశయాలు పూర్తిగా నిండాయని, అన్ని జలాశయాల వద్ద పరిస్థితిని పర్యవేక్షించాలని చెప్పారు. చెరువు కట్టలు పటిష్టంపై చర్యలు చేపట్టాలని, అవసరమైతే ఎన్‌డీఆర్ఎఫ్ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జలాశయాల పరీవాహక ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

విద్యతోనే విశ్వ మానవ వికాసం

(08 సెప్టెంబర్ 'అంతర్జాతీయ అక్షరాస్యత దినం' సందర్భంగా)

విద్యావంతులు నాయకత్వం వహించే సమాజం సమగ్రాభివృద్ధి దిశలో పయనిస్తుంది. విద్యతోనే అన్ని సమస్యలకు సమాధానాలు దొరుకుతాయి. పేదరిక నిర్మూలనలో విద్య పాత్ర వెలకట్టలేనిది. ప్రపంచ దేశాల తొలి ప్రయత్నం అక్షరాస్యత రేటును పెంచడం అవుతుంది. అక్షరాస్యులకు ఉన్నత విద్య గొడుగును కల్పిస్తే కుటుంబాల జీవనశైలిలో సమూల మార్పులు చోటు చేసుకుంటాయి. 2018 గణాంకాల ప్రకారం ప్రపంచ వయోజనుల అక్షరాస్యత రేటు 86 శాతం (పురుషుల్లో 90 శాతం, స్త్రీల్లో 83 శాతం) ఉండగా, భారతదేశ అక్షరాస్యత రేటు 77.7 శాతంగా (పురుషుల్లో 86 శాతం, స్త్రీల్లో 67 శాతం) నమోదు అయ్యింది. ప్రపంచ దేశాల్లో 15-24 ఏండ్ల యువతలో అక్షరాస్యత రేటు 92 శాతంగా ఉంది. ఉన్నత విద్యలో చేరుతున్న భారత యువతకు సంబంధించిన గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జిఈఆర్) 27.1 శాతంగా ఉండగా, ప్రపంచ దేశాల్లో అత్యధికంగా టెర్షరీ స్థాయి విద్య ఆస్ట్రేలియాలో 67 శాతంగా నమోదు అయ్యింది. ప్రపంచంలోని 145 పేద అల్పాదాయ, మధ్య ఆదాయవర్గ దేశాల విద్యారంగాలకు అభివృద్ధి చెందిన దేశాలు చేయూతను ఇవ్వాలి. విశ్వ విద్యకు, ఆరోగ్య కల్పనకు పెద్ద పీట వేయాలి. సామాజిక ఆర్థిక ప్రగతి, పేదరిక నిర్మూలన, అసమానతల తొలగింపు, అధిక జనాభా, శాంతి సామరస్యాల జీవనం లాంటివి విద్యతోనే పరిష్కరించబడతాయి.

"ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030" జాబితాలో 4వ లక్ష్యంగా 'నాణ్యమైన విద్య (క్వాలిటీ ఎడ్యుకేషన్)'కు పెద్ద పీట వేశారు. ఐరాస ఎజెండా-2030కి సంబంధించిన 2021 నివేదిక ప్రకారం కోవిడ్-19 కల్లోలం విద్యారంగాన్ని అత్యంత ప్రభావితం చేసిందని తేలింది. ఏప్రిల్ 2020లో 1.6 బిలియన్ల పిల్లలు (91 శాతం) పాఠశాలలకు దూరమైనారు. మధ్యాహ్న భోజనంపై ఆధారపడిన 369 మిలియన్ల పిల్లలు పోషకాహారానికి దూరం అయ్యారు. విద్యకు విఘాతం కలిగితే అన్ని రంగాలపై దాని దుష్ప్రభావం పడుతుంది. కరోనా విజృంభనతో దాదాపు 70 శాతం పిల్లల చదువులకు పూర్తిగా లేదా పాక్షికంగా ఆటంకం కలిగింది. పేదలు, అల్ప ఆదాయ వర్గాల పిల్లల విద్యార్జన కుంటుపడింది. దాదాపు 100 మిలియన్ల పిల్లలు కరోనా కారణంగా రీడింగ్ స్కిల్స్ కోల్పోయారు. పాఠశాలల మూసివేతతో పేద విద్యార్థులు అధికంగా బాల కార్మికులు లేదా బాల్యవివాహాల బారిన పడ్డారు. కోవిడ్-19 అకాలంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 65 శాతం, అభివృద్ధి చెందిన దేశాల్లో 35 శాతం విద్య నిధులను ఇతర శాఖలకు మార్చడంతో విద్యారంగం మరింతగా కుంగిపోయింది. కరోనా విపత్తుతో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించినా, పిల్లల్లో ఏకాగ్రత లోపించడం, భౌతిక కదలికలు లేకపోవడంతో ఆరోగ్యాలు క్షీణించడం గమనించారు. ప్రపంచవ్యాప్తంగా గత పది ఏండ్లలో (2010-19) సెకండరీ విద్య పూర్తి చేసిన యువత 46 శాతం నుంచి 53 శాతానికి పెరిగారు. 2010లో ప్రాథమిక విద్య 70 శాతం ఉండగా, 2018లో 84 శాతానికి పెరిగింది. 2030 నాటికి 89 శాతానికి చేరవచ్చని ఐరాస అంచనా వేస్తున్నాది. కరోనా కాలం 2020-21లో ఈ గణాంకాలు తిరోగమన ఫలితాలను ఇస్తున్నాయనటంలో అతిశయోక్తి లేదు. 2030 నాటికి 200 మిలియన్ల ప్రపంచ బాలలు పాఠశాల విద్యకు కూడా దూరంగా ఉంటారని అంచనా. కోవిడ్-19 అనంతరం అల్ప ఆదాయ దేశాల్లో ఉన్న 20 శాతం ధనికుల్లో 79 శాతం పిల్లలు, పేద కుటుంబాల్లో పిల్లలు 34 శాతం విద్యను పూర్తి చేస్తున్నారని తేలింది. ఆన్‌లైన్ విద్య 500 మిలియన్ల ప్రపంచ బాలలకు దూరం అయ్యింది. నేటికీ 65 శాతం పాఠశాలల్లో మాత్రమే కనీస వసతులు కల్పించబడినవి.

నిరంతర విద్య కల్పనతో పాటు నైపుణ్య శిక్షణలను పెంపొందించే కృషి జరగాలి. విద్యరంగంలో లింగ వివక్ష మరింత దుష్ప్రభావాన్ని చూపుతున్నది. బాలికలకు విద్యను అందిస్తే అనంతర కాలంలో కుటుంబమే విద్యావంతుల కోవెల అవుతుంది. మహిళా సాధికారతకు మహిళా విద్య ప్రధాన ఆయుధం కావాలి. పాఠశాలలు లేకపోవడం, వసతుల లేమి, బాలికలకు టాయిలెట్స్ కొరత, విద్యుత్తు కనెక్షన్ లేకపోవడం, ఆధునిక ఐసిటి వనరుల లేమి, నిరక్షరాస్యులైన తల్లితండ్రులు, పేదరికం, అధిక జనాభా లాంటి ప్రతికూలతలు విద్యావ్యాప్తిని నిరోధిస్తున్నాయి. మహమ్మారి 3వ అల అనుమానాల నడుమ విద్యాలయాలు నెమ్మదిగా తెరుచుకుంటున్నాయి. నేడు విద్యాలయాలు తెరవడానికి ముందు పలు కరోనా నియమనిబంధనలు పాటించాల్సి ఉంది. తరగతి గదులతో పాటు పాఠశాల ఆవరణను సానిటైజ్ చేయడం, తరగతి గదుల్లో వెంటిలేషన్ ఉండేలా జాగ్రత్త పడడం, భౌతిక దూరాలు పాటించడం, మాస్కులు ధరించడం అందరికి తప్పనిసరి చేయాలి. ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశాలుగా పేదరిక నిర్మూలన, ఉచిత విద్య కల్పన, వైద్య ఆరోగ్య వసతులు, సామాజిక రక్షణ, ఉద్యోగ ఉపాధుల కల్పన, వాతావరణ ప్రతికూల మార్పులను తగ్గించడం లాంటి చర్యలు తీసుకోవడం మరువరాదు. అందరికి నిర్బంధ పాఠశాల విద్య ఉచితం చేయాలి. వృత్తి నైపుణ్యాలు అందించే విద్య ప్రణాళికలు వేసి కార్యరూపం ఇవ్వాలి. ఉన్నత విద్యలో జిఈఆర్‌ను క్రమంగా పెంచేలా చర్యలు తీసుకోవాలి. విశ్వం కుగ్రామం అయిన ఈ డిజిటల్ యుగంలో దేశాల మధ్య అసమానతలు ప్రపంచ మానవాళికి ప్రతిబంధకాలు కానున్నాయి. విద్యతోనే విశ్వ కళ్యాణం కలుగుతుందని, మానవాళి సంక్షేమానికి విద్య ఉత్తమ ఉపకరణమని తెలుసుకొని అందరు పిల్లల్ని, యువతను విద్యావంతులుగా మార్చే మహాయజ్ఞంలో మనందరం భాగస్వామ్యం తీసుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

జిల్లా ఉపాధి కార్యాలయ ఆధ్వర్యంలో ఈ నెల 8న జాబ్ మేళ..!

-ఇంచార్జి జిల్లా ఉపాధి అధికారి ఎం. రాధిక

సంగారెడ్డి, సెప్టెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి) అపోలో ఫార్మసీ కంపెనీలో 250 ఉద్యోగాల భర్తీకి గాను టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్ ట్రైనీస్ ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.అభ్యర్థులు డి ఫార్మసీ/బి ఫార్మసీ/ఎం ఫార్మసీ/ ఎస్.ఎస్.సి./ ఇంటర్/ డిగ్రీ అభ్యర్థులు అర్హులన్నారు.18 నుండి 35 సంవత్సరాల లోపు వయస్కులు అర్హులని ఆమె తెలిపారు.

ఆసక్తి అర్హత గల నిరుద్యోగులు ఈనెల 8న ఉదయం 11 గంటల నుండి 2 గంటల లోపు బైపాస్ రోడ్డులో గల పాత వెలుగు ఆఫీస్ ప్రాంగణంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జరుగు జాబ్ మేళాకు నేరుగా హాజరుకావాలని ఆమె సూచించారు.

జాబ్ మేళాకు విచ్చేయు అభ్యర్థులు విధిగా మాస్క్ ధరించాలని ,భౌతిక దూరం పాటించాలని స్పష్టం చేశారు.

చెరుకు రైతులు అధైర్యపడవద్దు....!

-రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు.

సంగారెడ్డి, సెప్టెంబర్ 7(నేటినిజం ప్రతినిధి) జహీరాబాద్ ప్రాంతంలో సాగైన చివరి చెరకుగడ వరకు క్రషింగ్ జరిగేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు తెలిపారు. సోమవారం హైదరాబాదులో మంత్రి ట్రైడెంట్ చక్కెర కర్మాగారం చైర్మన్, జహీరాబాద్ శాసన సభ్యులు, మాజీ శాసన మండలి సభ్యులు, జిల్లా కలెక్టర్, సి డి సి, డీసీఎంఎస్ చైర్మన్, గణపతి షుగర్, గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు, సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి, జహీరాబాద్ ప్రాంత చెరకు రైతుల సమస్యలపై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో చెరుకు సాగు చేస్తున్న రైతులు ఏ విధమైన నష్టానికి గురికాకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. చెరుకు సాగు రైతులు ఎవరు అధైర్య పడవద్దన్నారు. త్వరలోనే క్రషింగ్ ప్రారంభించాలని కంపెనీ యాజమాన్యానికి ఆదేశించామన్నారు. సాగైన మొత్తం చెరుకును క్రషింగ్ చేసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సంగారెడ్డి లోని గణపతి షుగర్ ,గాయత్రి షుగర్, కామారెడ్డి మాగి షుగర్, కొత్తకోట ఫ్యాక్టరీలకు పంపడం జరుగుతుందని తెలిపారు.

ఆయా ఫ్యాక్టరీల యాజమాన్యాలు జహీరాబాద్ ప్రాంత చెరుకును క్రషింగ్ చేయడానికి సమ్మతించారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అన్నిరకాల చర్యలు చేపడుతుందని, జహీరాబాద్ చెరుకు రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసానిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు, మాజీ శాసన మండలి సభ్యులు ఫరుద్దుద్దిన్, డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్, సి డి సి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ట్రైడెంట్ చక్కెర కర్మాగారం చైర్మన్ నందకుమార్ , గణపతి షుగర్, గాయత్రి చక్కర ఫ్యాక్టరీల యాజమాన్యం, చక్కెర శాఖ కమిషనర్ బద్రు మాల్, ఏడి రవీందర్ , వ్యవసాయ శాఖ ఏడి బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి 'నాల్కో నమస్యా' మొబైల్ యాప్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:కేంద్ర గనుల మంత్రిత్వ శాఖకు చెందిన మినీరత్న అయిన ప్రభుత్వ రంగం సంస్థ 'నేషనల్ అల్యూమినియం కంపెనీ' (నాల్కో) లిమిటెడ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలను (ఎంఎస్‌ఈలను) శక్తిమంతం చేయడంలో కీలక పాత్రను పోషిస్తోంది. సంస్థ ఈ చొరవనలో భాగంగా వినూత్నమైన 'నాల్కో మైక్రో మరియు స్మాల్ ఎంటర్‌ప్రైజ్ యోగాయోగ్ అప్లికేషన్' (నమస్యా) మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. కంపెనీకి చెందిన ఎంఎస్‌ఈ వెండార్ల ప్రయోజనార్థం ఈ యాప్‌ను సంస్థ రెండు భాషల్లో

అందుబాటులోకి తెచ్చింది. దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వారికి, దేశంలోని మైనింగ్ ఖనిజ రంగంలో తగిన అనుకూల పర్యావరణ వ్యవస్థ అభివృద్ధికి గాను నాల్కో సంస్థ చేసిన కృషిని కేంద్ర బొగ్గు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి, అభినందించారు. ఎంఎస్ఈల అభివృద్ధికి కంపెనీ ప్రయత్నాల్ని ప్రధానంగా వెలుగులోకి తేచ్చేందుకు 'నమస్యా' యాప్ ఒక వేదికను అందిస్తుంది. ఈ యాప్ ద్వారా నాల్కో విక్రేత నమోదు ప్రక్రియ, వారు ఎలాంటి వస్తువులను సరఫరా చేసేందుకు వీలుంది.. వాటి సాంకేతిక వివరణ, విక్రేత అభివృద్ధి తో పాటుగానాల్కోశిక్షణా కార్యక్రమాలతో వారికి సరఫరా చేయగల అంశాల గురించి అవసరమైన సమాచారాన్ని ఎంఎస్‌ఈలకు ఈ యాప్ ద్వారా అందించబడుతుంది. మొత్తం భారత దేశంలో బాధ్యతాయుతమైన కార్పొరేట్ సంస్థగాను ప్రధాన అల్యూమినియం ఉత్పత్తి, ఎగుమతి సంస్థగా కంపెనీ వ్యాపారం చేసే ప్రక్రియను సులభతరం చేయడానికి, ముఖ్యంగా మైనింగ్ మరియు మెటల్ వ్యాపారంలో పాల్గొన్న ఎంఎస్‌ఈ సెక్టార్ కోసం అనేక రకాల కార్యక్రమాలను చేపట్టింది. తన ఏకోసిస్టమ్ ద్వారా సమ్మిళిత వృద్ధి, స్థిరమైన అభివృద్ధి దిశగా నాల్కో వివిధ రకాల చొరవను చేపడుతూ వస్తోంది.

క్రైంబృందాలకు చెందిన పోలీసులు నేరాల ఛేదన ద్వారా నేరస్థుల గుండెల్లో గుబులు పుట్టించాలి

-అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్

కరీంనగర్ సెప్టెంబర్ 7:(నేటినిజం ప్రతినిధి): క్రైంబృందాలకు చెందిన పోలీసులు నేరాలను వేగవంతంగా ఛేదిస్తూ నేరస్థుల గుండెల్లో గుబులు పుట్టించాలని కరీంనగర్ అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్ అన్నారు. నేరాలు వేగవంతంగా ఛేదించబడుతూ నిందితులు శిక్షింపబడటం ద్వారా పాతనేరస్థులు నేరాలు చేసేందుకు సాహసించరని, తద్వారా నేరాలు నియంత్రించబడుతాయని చెప్పారు.

మంగళవారంనాడు కమీషనరేట్ కేంద్రంలో క్రైంబృందాలకు చెందిన పోలీసులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్ మాట్లాడుతూ నేరాల ఛేదనకు ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడంతోపాటు టెక్నాలజీ వినియోగంతో ముందుకుసాగాలన్నారు. జరిగిన నేరాలు వేగవంతంగా ఛేదించబడి సదరు కేసుల్లో నిందితులు శిక్షింపబడేలా పటిష్ట చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల్లో పోలీసులపట్ల నమ్మకం మరింత పెరగడంతోపాటు పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంపొందుతుందని చెప్పారు. నేరాల ఛేదనకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కమీషనరేట్ కేంద్రంలో అందుబాటులో ఉందని, ఆ విభాగం సేవలను సద్వినియోగం చేసుకున్నట్లయితే నేరాల ఛేదనలో క్రైంబృందాలకు చెందిన పోలీసులు సఫలీకృతం అవుతారని పేర్కొన్నారు. నేరాల ఛేదన, నియంత్రణకు కృషి చేస్తున్న పోలీసులకు మరిన్ని అదనపు సౌకర్యాలను కూడా కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సాహసోపేతమైన చర్యలతో ముందుకుసాగుతూ సమర్థవంతమైన సేవలందించడం ద్వారానే గుర్తింపు లభిస్తుందని చెప్పారు. నేరాల ఛేదనను ఛాలెంజ్‌గా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నేరాల ఛేదనే లక్ష్యంగా ఆత్మస్థైర్యంతో ముందుకుసాగడం ద్వారా ఎలాంటి నేరాలనైనా ఛేదించడం సాధ్యం అవుతుందనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు. నేరాల ఛేదన ద్వారా నేరస్థులకు దడపుట్టించాలని చెప్పారు. నేరం జరిగిన తీరు, సంఘటనస్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఈ తరహా నేరాలు ఏప్రాంతానికి చెందిన నేరస్థులు పాల్పడుతారనే విషయంలో అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. నేరాల ఛేదనలో కీలకపాత్ర పోషించే అన్నిస్థాయిలకు చెందిన అధికారులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సిసిఎస్ ఏసిపి శ్రీనివాస్, ఇన్స్‌పెక్టర్లు శివకుమార్, వెంకటనర్సయ్య, ఎస్ఐ అశోక్‌రెడ్డిలతోపాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కోవిడ్ టీకాపై అపోహలు అవసరం లేదు: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు టీకాకరణ ఒక్కటే సరైన ప్రత్యామ్నాయమని భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. టీకాకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న అపోహలు, ఆందోళనలను పరిష్కరించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన సూచించారు. టీకా తీసుకోవడం ద్వారా ఒకవేళ కరోనా సోకినా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా, ఆసుపత్రి పాలయ్యే పరిస్థితి తప్పుతుందన్న నిపుణుల సూచనలను, పలు అధ్యయనాల నివేదికలను ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు.

మంగళవారం రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత టీకాకరణ శిబిరాన్ని ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని స్వర్ణభారత్ ట్రస్ట్ కేంద్రాల్లో (హైదరాబాద్, విజయవాడ, నెల్లూరు) ఏక కాలంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు ప్రాంగణాల్లో కలుపుకుని దాదాపు 5వేల మందికి టీకాలు వేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరోనాతో సాగుతున్న పోరాటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రపంచంలోనే అతిపెద్ద టీకాకరణ కార్యక్రమాన్ని చేపడుతోందని, దీన్ని ప్రజా ఉద్యమంగా మార్చి విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

ప్రజాప్రతినిధులు, కళాకారులు, క్రీడాకారులు ఇలా ప్రతి ఒక్కరూ టీకా విషయంలో ప్రజల్లో నెలకొన్న అపోహల్ని పోగొట్టేందుకు, టీకాకరణ ప్రక్రియ సక్రమంగా సాగేలా చొరవ తీసుకోవాలని సూచించారు. పత్రికలు కూడా ఈ విషయంలో తమ పాత్రను సమర్థవంతంగా పాటించాలన్నారు.

ఆగస్టు నెలలో 50శాతం మంది భారతీయులకు టీకాలు వేయడం పూర్తవడం సంపూర్ణ టీకాకరణ కార్యక్రమంలో భాగంగా భారతదేశం సాధించిన విజయాల్లో ఒకటని పేర్కొన్న ఉపరాష్ట్రపతి, అభివృద్ధి చెందిన దేశాలు కూడా కరోనా బారిన పడి ఇబ్బందులు పడుతున్న సమయంలోనూ భారతదేశం ఆత్మనిర్భరతను చాటుకుంటూ టీకాల తయారీ, ఉచితంగా ప్రజలకు టీకాలు అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు.

'వసుధైవ కుటుంబకం' విధానం స్ఫూర్తితో విదేశాలకు సైతం మన టీకాలు పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇదే విధంగా వివిధ రంగాల్లో ఆత్మనిర్భరతను కనబరుస్తూ, దేశం మరింత ప్రగతి సాధించే ప్రయత్నంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగం పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

విశ్వమానవాళిపై కరోనా చూపించిన ప్రతికూల ప్రభావాన్ని, వందేళ్లలో ఎన్నడూ చూడని పరిస్థితులను గుర్తుచేస్తూ, ఈ అసాధారణ సంక్షోభాన్ని అసాధారణ రీతిలోనే ఎదుర్కోవాలని ఉపరాష్ట్రపతి సూచించారు. కరోనాపై పోరాటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీమిండియా స్ఫూర్తితో పనిచేస్తున్నాయన్న ఆయన, అందరూ కలిసి ముందుకు సాగితేనే సత్ఫలితాలను సాధించగలమన్నారు.

మహమ్మారిని ఎదుర్కొనేందుకు

పంచసూత్రాలను సూచించిన ఉపరాష్ట్రపతి, శారీరక శ్రమను, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఇందుకోసం యోగను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి ధ్యానం, ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. భారతీయ ఆహారపు అలవాట్లను మళ్లీ వినియోగంలోకి తెస్తూ జంక్‌ఫుడ్ ను త్యజించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ప్రభుత్వాలు, నిపుణులు సూచించినట్లుగా మాస్కులు ధరించడం, సురక్షిత దూరం పాటించడం వంటి జాగ్రత్తలను పాటించాలన్న ఉపరాష్ట్రపతి, వీటన్నింటితోపాటు ప్రకృతితో మమేకమై జీవించడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.

ఉచిత కోవిడ్ టీకా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వాహకులకు, ఈ కార్యక్రమంలో భాగస్వాములైన భారత్ బయోటెక్, ముప్పవరపు ఫౌండేషన్, మెడిసిటీ హాస్పిటల్స్ (హైదరాబాద్), సింహపురి వైద్య సేవాసమితి (జయభారత్ హాస్పిటల్స్?నెల్లూరు), పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్స్ (విజయవాడ) వారిని ఉపరాష్ట్రపతి అభినందించారు.

ఈ సందర్భంగా భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సుచిత్ర ఎల్లా మాట్లాడుతూ.. గతంలో భారతదేశంలో టీకాలను దిగుమతి చేసుకోవడం ద్వారా ఎక్కువగా ఖర్చుచేయాల్సి వచ్చేదని, కానీ దేశీయంగా టీకాలను రూపొందించుకుని ఉత్పత్తి చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవడంతోపాటు మన దేశంలో అన్ని ప్రాంతాల్లో టీకాలు అందించేందుకు వీలుంటుందన్నారు. హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లోని కేంద్రాలనుంచి కూడా కోవాగ్జిన్ టీకాను ఉత్పత్తి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. దీని ద్వారా మరింత వేగంగా దేశ ప్రజలకు టీకాలు అందించేందుకు వీలుపడుతుందన్నారు. జాతీయ టీకాకరణ కార్యక్రమంలో భాగంగా, తమతోపాటు మరో స్వదేశీ కంపెనీ టీకాలను ఉత్పత్తి చేయడం, తద్వారా దేశానికి పేరు తీసుకొచ్చే మహత్కార్యంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని సుచిత్ర ఎల్లా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సతీమణి శ్రీమతి ఉషమ్మ, భారత్ బయోటెక్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సుచిత్ర ఎల్లా, స్వర్ణ భారత్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ కామినేని శ్రీనివాస్, హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి సుబ్బారెడ్డి, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ శ్రీ భద్రారెడ్డి, ట్రిపుల్ ఒలింపియన్ శ్రీ ఎన్ ముకేశ్ కుమార్ పాల్గొనగా.. స్వర్ణభారత్ ట్రస్ట్ నెల్లూరు చాప్టర్ నుంచి సర్వేపల్లి శాసనసభ్యుడు శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు (గ్రామీణం) శాసనసభ్యులు శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నెల్లూరు జిల్లా కలెక్టర్ శ్రీ చక్రధర్ బాబు, స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపావెంకట్, ముప్పవరపు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ ముప్పవరపు హర్షవర్ధన్, సింహపురి వైద్య సేవా సమితి నిర్వాహకులు శ్రీ నాగారెడ్డి హరికుమార్ రెడ్డితోపాటు.. విజయవాడ చాప్టర్ నుంచి రాజ్యసభ సభ్యుడు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గన్నవరం శాసన సభ్యులు శ్రీ వల్లభనేని వంశీ మోహన్, స్వర్ణభారత్ ట్రస్ట్ విజయవాడ చాప్టర్ సెక్రటరీ శ్రీ చుక్కపల్లి ప్రసాద్, స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ శ్రీ గ్రంధి విశ్వనాథ్ తదితరులతోపాటు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్న మెడిసిటీ ఆసుపత్రి (హైదరాబాద్), జయభారత్ ఆసుపత్రి (నెల్లూరు), పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల (విజయవాడ) ప్రతినిధులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఆసరా సీఎం రిలీఫ్‌ఫండ్ : విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి

హైదరాబాద్ , సెప్టెంబర్ 7: సీఎం రిలీఫ్‌ఫండ్ ఎందరో పేదలకు ఆసరాగా నిలుస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. సిరిగిరిపురం గ్రామానికి చెందిన వరికుప్పల యాదయ్యకు ఆరోగ్యం బాగలేకపోవడంతో సీఎం రిలీఫ్‌ఫండ్‌కు ధరఖాస్తు చేసుకోగా అతనికి 12వేల రూపాయలు మంజూరయ్యాయి. ఆచెక్కును నగరంలోని మంత్రి నివాసంలో ఆయనకు అందజేశారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతున్నాయని ఆమె అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఆమె అన్నారు. ఈకార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ మండల యువజన నాయకులు శ్రీను పాల్గొన్నారు.

బ్రిక్స్ 13వ శిఖర సమ్మేళనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:బిఆర్ఐసిఎస్ ('బ్రిక్స్') కు 2021వ సంవత్సరం లో భారతదేశం అధ్యక్ష స్థానం లో కొనసాగుతూ ఉన్న నేపథ్యం లో, 2021 సెప్టెంబర్ 9 న జరుగనున్న 'బ్రిక్స్' పదమూడో శిఖర సమ్మేళనాని కి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వర్చువల్ మాధ్యమం ద్వారా అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశం లో బ్రెజిల్ అధ్యక్షుడు మాన్య శ్రీ జాయిర్ బోల్ సొనారొ, రష్యా అధ్యక్షుడు మాన్య శ్రీ వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు మాన్య శ్రీ శీ చిన్ పింగ్, దక్షిణ ఆఫ్రికా అధ్యక్షుడు మాన్య శ్రీ సాయిరిల్ రామాఫోసా లు పాలుపంచుకోనున్నారు. భారతదేశాని కి జాతీయ భద్రత సలహాదారు గా ఉన్న శ్రీ అజీత్ డోవాల్, న్యూ డెవలప్ మెంట్ బ్యాంక్ అధ్యక్షుడు శ్రీ మార్కోస్ ట్రాయజో, బ్రిక్స్ బిజినెస్ కౌన్సిల్ తాత్కాలిక అధ్యక్షుడు శ్రీ ఓంకార్ కంవర్, బ్రిక్స్ విమెన్స్ బిజినెస్ అలాయన్స్ తాత్కాలిక అధ్యక్షురాలు డాక్టర్ సంగీత రెడ్డి ఈ సందర్భం లో తమ తమ హోదాల లో ఏడాది పొడవున చేపట్టిన కార్యాల ఫలితాల ను గురించిన నివేదిక ను నేతల కు సమర్పిస్తారు.

ఈ శిఖర సమ్మేళనాని కి 'బ్రిక్స్15: ఇంట్రా- 'బ్రిక్స్' కోఆపరేశన్ ఫార్ కంటిన్యూటీ, కన్సాలిడేశన్ ఎండ్ కన్ సెన్సస్' అనే అంశం ఇతివృత్తం గా ఉంది. భారతదేశం తన అధ్యక్ష హోదా లో నాలుగు ప్రాధాన్య రంగాల ముసాయిదా ను రూపొందించింది. ఆ నాలుగు రంగాల లో బహుళ స్థాయి ల ప్రణాళిక, ఉగ్రవాదాన్ని ఎదురించడం, ఎస్ డిజి స్ లక్ష్యాల ను సాధించడం కోసం డిజిటల్ ఎండ్ టెక్నలాజికల్ టూల్స్ ను వినియోగించడం లతో పాటు ప్రజల మధ్య రాకపోకల ను పెంచడం వంటివి భాగం గా ఉన్నాయి. ఈ రంగాల కు అదనం గా, నేత లు కోవిడ్ మహమ్మారి దుష్ప్రభావాలు, ఇతర వర్తమాన ప్రాంతీయ అంశాలు మరియు ప్రపంచ అంశాల పై వారి వారి అభిప్రాయాల ను కూడా పరస్పరం వ్యక్తం చేయనున్నారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'బ్రిక్స్' సమ్మేళనానికి అధ్యక్షత వహించడం ఇది రెండో సారి. ఇంతకు ముందు 2016వ సంవత్సరం లో ఆయన గోవా శిఖర సమ్మేళనాని కి అధ్యక్షత వహించారు. ఈ సంవత్సరం లో 'బ్రిక్స్' కు భారతదేశం అధ్యక్ష స్థానం లో ఉండడం, ఈ ఏడాది లో 'బ్రిక్స్' తాలూకు పదిహేనో స్థాపన వార్షిక ఉత్సవాన్ని జరుపుకొంటూ ఉండడం యాదృచ్ఛికం అని చెప్పాలి. ఇదే అంశం ఈ శిఖర సమ్మేళనాని కి ఎంపిక చేసిన ఇతివృత్తం లో కూడా ప్రతిఫలిస్తున్నది

రోశ్‌హశానాహ్ నాడు ప్రపంచ వ్యాప్త యూదులకు శుభాకాంక్షలు తెలిపినప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:అ రోశ్ హశానాహ్ సందర్భం లో ప్రపంచ వ్యాప్త యూదు ప్రజల కు, ఇజ్రాయిల్ లోని స్నేహపూర్వక వాసుల కు, ఆ దేశ ప్రధాని శ్రీ నఫ్తాలీ బెనెత్ కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన ఆప్యాయభరితమైనటువంటి శుభాకాంక్షల ను వ్యక్తం చేశారు.

"ఈ రోజు న రోశ్ హశానాహ్ ను జరుపుకొంటున్న ప్రపంచ వ్యాప్త యూదు ప్రజల కు, ఇజ్రాయిల్ లోని స్నేహపూర్వకమైనటువంటి పౌరుల కు, ప్రధాని ఏనిజీటబిజీశ్రీతిఎవనినవబిబి కు ఇవే అప్యాయ భరిత శుభాకాంక్షలు" అని ప్రధాన మంత్రి ఒక ట్వీట్ లో పేర్కొన్నారు.

కామారెడ్డి జిల్లాలో పోషణ్ మాసోత్సవాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:చిన్నారులకు పోషణ లోపం నుంచి విముక్తి కల్పించడానికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పోషణ్ అభియాన్ పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలను సంపూర్ణ ఆరోగ్యవంతులును తయారు చేసే విధంగా చూడాలన్నారు. పోషణ మాసం సందర్భంగా ఈనెల 30 వరకు గ్రామాల్లో అవగాహన సదస్సు ఏర్పాటు

చేయాలని పేర్కొన్నారు. ఎదుగుదల తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం అదేవిధంగా చూడాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పోషణ లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సరైన పోషణ అందే విధంగా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పోషణ అభియాన్ లో జిల్లాను మొదటి స్థానంలో నిలిచే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, సి డి ఎస్ పి డి సరస్వతి, జిల్లా వ్యవసాయ అధికారి ని భాగ్యలక్ష్మి, విద్యాశాఖ అధికారి రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణేష్ చతుర్థి వేడుకలపై మహారాష్ట్ర హెచ్చరికలు!

ముంబై, సెప్టెంబర్ 7:: గణేష్ వేడుకల సందర్భంగా ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన కొవిడ్-19 నిబంధనలను విధిగా పాటించాలని మహారాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి రాజేష్ తోపే హెచ్చరించారు. ప్రజలు పండుగ సందర్భంగా పెద్దసంఖ్యలో గుమికూడితే వైరస్ వ్యాప్తి చెందుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో ఈ పరిస్థితి తలెత్తడం చూశామని, కేరళలో ఓనం ఉత్సవాల్లో ప్రజలు ఒక్కచోట చేరడంతో కరోనా రోగుల సంఖ్య విపరీతంగా పెరిగిందని మంత్రి గుర్తుచేశారు.మహారాష్ట్రలో పుణేతో పాటు నాలుగైదు జిల్లాల్లో కొవిడ్-19 కేసుల సంఖ్య అధికంగా ఉందని అన్నారు. మరోవైపు కొవిడ్-19 థర్డ్ వేవ్ విస్తరించకపోయినా దేశంలోనే ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముంబై మేయర్ కిషోరి పెడ్నేకర్ హెచ్చరించారు. ప్రజలు ఇండ్లలోనే పండగ జరుపుకోవాలని సూచించారు. ఇక రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలకు దూరంగా ఉండాలని, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనే కార్యక్రమాలను రద్దు చేసుకోవాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే ఇప్పటికే విజ్ఞప్తి చేశారు. పండుగలు తర్వాత జరుపుకోవచ్చని ప్రజల ప్రాణాలే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

పౌష్టికాహారం పై విస్తృత అవగాహన కల్పించాలి':నిజామాబాదు కలెక్టర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:పోషణ మాసోత్సవాల పై మారుమూల ప్రాంతాలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని నిజామాబాద్
జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం ప్రగతి భవన్ సమావేశ మందిరంలో పోషణ మాసోత్సవాలపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పోషణ మాసోత్సవాల కార్యక్రమంలో ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ఆరోగ్యంపై మారుమూల ప్రాంతాలలో అవగాహన కల్పించాలని అందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

అనంతరం పోషణ మాసోత్సవాల గోడపత్రిక ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు చిత్ర మిశ్రా, చంద్రశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు

గ్రామపంచాయతీ నిర్వహణ వ్యవస్థలో పంచాయతీ కార్యదర్శులది కీలక పాత్ర ..!

-పంచాయతీరాజ్ చట్టం మేరకు అన్ని అంశాలపై అవగాహన తో విధులు నిర్వహించాలి.

-అదనపు కలెక్టర్ రాజార్షి షా సూచించారు.

సంగారెడ్డి, సెప్టెంబర్ 7(నేటినిజం ప్రతినిధి) మంగళవారం పాత డి.ఆర్.డి.ఎ కార్యాలయంలోని జిల్లా మహిళా సమాఖ్య భవనంలో కంగ్టి, కల్హేర్, సిర్గాపూర్, నాగలి గిద్ద మండలాల పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా రాజర్షి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు అన్ని అంశాలపై పూర్తిస్థాయి అవగాహనతో గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు.

ఇట్టి శిక్షణ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ చట్టంలోని ముఖ్య అంశాలు, జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టే విధానం, గ్రామపంచాయతీ పరిపాలన, బడ్జెట్ ,పనులు ఆదాయం, వ్యయాలు, బిల్లుల చెల్లింపు అకౌంట్, ఆడిట్, హరితహారం, నర్సరీలు గ్రామపంచాయతీ రికార్డుల నిర్వహణ, ఇ- పంచాయతీ అప్లికేషన్స్, లే అవుట్ అండ్ బిల్డింగ్ రూల్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా అంశాలపై సందేహాలను డిపిఓ సురేష్ మోహన్ నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఎ ఎపిడి, ఎంపీడీవోలు ఎంపీడీవోలు, నాలుగు మండలాలకు చెందిన 118 మంది పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఏపీలో నూతన విద్యా విధానం!

అమరావతి, సెప్టెంబర్ 7:నూతన విద్యా విధానం అమలుపై అన్ని రకాలుగా సిద్ధం కావాలని, ఆ దిశగా అడుగులు ముందుకేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు. నాడు-నేడు, ఫౌండేషన్ స్కూళ్లపై మంగళవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. రెండో దశ నాడు-నేడు పనుల ప్రగతిపై సమీక్షించారు. పాఠ్య పుస్తకాల ముద్రణ నాణ్యతను పెంచడంతో పాటు, కనీసం మూడో తరగతి నుంచి సబ్జెక్టుల వారీగా టీచర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సీబీఎస్ఈ అఫిలియేషన్‌పై ముఖ్యమంత్రికి అధికారులు వివరాలు అందించారు. ముందుగా వేయి స్కూళ్లను అఫిలియేషన్ చేస్తున్నామని అధికారులు తెలిపారు. అన్ని రకాల స్కూళ్లు సీబీఎస్ఈ అఫిలియేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఐసీఎస్ఈ అఫిలియేషన్‌మీద కూడా దృష్టిపెట్టాలని సీఎం సూచించారు.

నాడు 1నేడు కింద రెండో విడతలో 12,663 పాఠశాలలను ఆధునీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 4535.74 కోట్ల రూపాయల ఖర్చుకు ప్రణాళికలు వేసినట్లు తెలిపారు. 18,498 అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మూడో విడతలో నాడు?నేడు కింద 24,900 స్కూళ్లు చేపడుతున్నట్లు వివరించారు. ఇందుకోసం రూ.7821 కోట్ల ఖర్చు అంచనా వేసినట్లు తెలిపారు. రెండో దఫా నాడు ? నేడుకు సంబంధించి టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. నాడు ? నేడు పనులకు సంబంధించి సచివాలయంలో ఇంజినీర్లకు శిక్షణ ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. సుమారు 12వేల మందికి శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం పేరెంట్స్ కమిటీలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. స్కూళ్ల నిర్వహణ, టాయిలెట్ల నిర్వహణలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సీఎం జగన్ ఆదేశించారు.

నాడు- నేడు కార్యక్రమం ద్వారా ఇంత డబ్బు ఖర్చుపెట్టిన తర్వాత కచ్చితంగా స్కూళ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, లేకపోతే మళ్లీ పూర్వపు స్థితికి వెళ్లిపోతాయన్నారు. స్కూళ్లలో ఎలాంటి మరమ్మతులు వచ్చినా, ఏదైనా సమస్యలు వచ్చినా వెంటనే చేయించడానికి ఫండ్ ఒకటి ప్రతి స్కూల్లో ఉంచాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై ఎస్ఓపీలను తయారు చేయాలని, అప్పుడే స్కూళ్లు నిత్యనూతనంగా ఉంటాయన్నారు. ఈ ఏడాది విద్యాకానుక కింద నూటికి నూరుశాతం పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు.

ఈ ఏడాది జగనన్న విద్యాకానుక కింద నూటికి నూరుశాతం పంపిణీ పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. వచ్చే ఏడాది విద్యా కానుక కింద ఇవ్వనున్న వస్తువులపై సీఎంకు వివరాలు అందించారు. రాష్ట్రంలో కోవిడ్ పరిస్థితులు తగ్గుముఖం పడుతున్నందున వచ్చే ఏడాది పిల్లలు స్కూల్‌కు వెళ్లేనాటికే విద్యాకానుక అందించాలని సీఎం జగన్ స్పష్టం చేశారు. విద్యాకానుక కింద ఇచ్చే వస్తువులు నాణ్యతగా ఉండాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచి విద్యాకానుకలో భాగంగా స్పోర్ట్స్ షూ, స్పోర్ట్స్ డ్రస్, మంచి డిజైన్, నాణ్యత ఉండేలా చూడాలని తెలిపారు. స్వేచ్ఛ కార్యక్రమం కింద స్కూల్లో ఆడపిల్లలకు శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ కార్యక్రమం చేసినట్లు చెప్పారు. అక్టోబరు మధ్యంతరంలో కార్యక్రమం ప్రారంభానికి సన్నహాలు చేస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు.

'ఆజాది కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ 'ఫుడ్ ప్రాసెసింగ్ వీక్'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారత ప్రభుత్వం 'ఆజాదీ కా అమృత్ మహోత్సవం' జరుపుకుంటుంది.

వేడుకలో భాగంగా, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ 2021 సెప్టెంబర్ 6 నుండి 12 వరకు 'ఫుడ్ ప్రాసెసింగ్ వీక్' పాటిస్తోంది. అందులో భాగంగా మంత్రిత్వ శాఖ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అధికారిక వీడియో ద్వారా మంత్రిత్వ శాఖ 'ఫుడ్ ప్రాసెసింగ్ వీక్' ను 6 సెప్టెంబర్, 2021 సోమవారం నాడు ప్రారంభించింది. పిఎంఎఫ్ఎంఈ పథకం లబ్ధిదారు విజయ గాథ శ్రీమతి.

రాధికా కామత్ 'ఆత్మనిర్భర్ ఎంటర్‌ప్రైజెస్' సిరీస్‌లో మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో ప్రచురించబడింది.

మధ్యప్రదేశ్‌లోని దామోహ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ ద్వారా 'వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రొడక్ట్' కింద టొమాటో ప్రాసెసింగ్ మరియు వాల్యూ యాడ్‌పై ఒక వెబ్‌నార్ నిర్వహించబడింది. రూ.3.16 కోట్ల విత్తన మూలధనం మొత్తం 811 స్వయం సహాయక బృందాల సభ్యుల కోసం గ్రామ పంచాయితీ స్థాయి సమాఖ్యలకు బదిలీ చేయబడింది.

ఈ క్రమంలో గౌరవనీయ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రహ్లాద్ సింగ్ పటేల్ కేంద్ర పథకం - ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన సిఇఎఫ్‌పిపిసి పథకం కింద మధ్యప్రదేశ్‌లోని మాండ్ల జిల్లా మానేరి ఫుడ్ పార్క్‌లో 'ఎం/ఎస్ విభూతి మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్' యొక్క ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు.

గౌరవనీయమైన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యాధునిక ప్రాసెసింగ్ సదుపాయాన్ని అభివృద్ధి చేసినందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రమోటర్లను అభినందించారు.

ఈ యూనిట్ రైతులు, స్వయం సహాయక బృందాలు మరియు సూక్ష్మ పారిశ్రామికవేత్తలకు ప్రాసెసింగ్ అవకాశాలను అందిస్తుంది. మరియు పరిసర ప్రాంతాల్లో మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని ఆయన అన్నారు.

ఈ యూనిట్ రూ .12.90 కోట్ల ప్రాజెక్ట్ వ్యయంతో మరియు మంత్రిత్వ శాఖ నుండి రూ .4.65 కోట్ల గ్రాంట్-ఇన్-ఎయిడ్ ద్వారా ఏర్పాటు చేయబడింది. ఈ యూనిట్ యొక్క మొత్తం సామర్థ్యం (అవుట్‌పుట్) గంటకు 4000 లీటర్లు. ఈ యూనిట్ 260 మందికి ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధిని అందిస్తుంది. మరియు రైతులు వారి వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన ధరలను పొందేందుకు ప్రయోజనం చేకూరుస్తుంది.

గత సీజన్‌కంటే 16 శాతం పెరిగిన ధాన్యం సేకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:2020-21 ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం 889.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని (ఖరీఫ్ పంట 718.09 లక్షల మెటరిక్ టన్నుల, రబీ పంట 171.53 లక్షల మెట్రిక్ టన్నులను 05-09-2021 నాటికి కొనుగోలు చేయడం జరిగింది. గత ఏడాది కొనుగోలు చేసిన ధాన్యం 764.39 లక్షల మెట్రిక్ టన్నులు. గత ఏడాది కంటే ఇది అధికం.

ప్రస్తుత ధాన్యం సేకరణ 130.47 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలిగించింది.దీని మద్దతు ధర రూ 1,67,960.77 కోట్లు. ధాన్యం ప్రొక్యూర్‌మెంట్ గత ఏడాది .2019-20 సేకరణ అయిన 773.45 లక్షల మెట్రిక్ టన్నుల స్థాయికి మించి మున్నెన్నడూ లేనంతటి గరిష్ఠస్థాయికి చేరింది.

ఆర్.ఎం.ఎస్ 2021-22 కు సంబంధించిన మార్కెటింగ్ సీజన్ గోధుమ ప్రొక్యూర్‌మెంట్ రాష్ట్రాలలో ముగిసింది. ఇప్పటివరకు అంటే 18-08-2021 నాటికి 433.44 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమను సేకరించడం జరిగింది. (ఇది గరిష్ఠస్థాయి సేకరణ.ఇది గత ఏడాది సేకరించిన అంటే 2020-21లో సేకరించిన 389.93 లక్షల మెట్రిక్ టన్నులకు మించి ఉంది.) గత ఏడాది ఇదే కాలానికి కేంద్ర ప్రభుత్వం 389.93 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించింది.

ప్రస్తుత ఆర్.ఎం.ఎస్ ప్రొక్యూర్‌మెంట్ కార్యకలాపాల నుంచి 49.20 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందారు. దీని మద్దతు ధర విలువ 85603.57 కోట్ల రూపాయలు.

2020-21 పంట సంవత్సరానికి అంటే 2020-21 ఖరీఫ్, 2021 రబీ, 2021 వేసవి సీజన్ తో కలిపి, ప్రభుత్వం తన నోడల్ ఏజెన్సీల ద్వారా 11,93,713.15 మెట్రిక్ టన్నుల పప్పుధాన్యాలు, చమురు గింజలను 6,742.51 కోట్ల రూపాయల విలువగల మద్దతు ధరకు కొనుగోలు చేసింది. దీనివల్ల తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్,తెలంగాణా, హర్యానా, ఒడిషా, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన 7,02,368 మంది రైతులకు 2021 సెప్టెంబర్ 5 నాటికి ప్రయోజనం కలిగింది.

2021-22 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కు సంబంధించి తాజా పంట త్వరలోనే రానుంది. కర్ణాటక రాష్ట్రం నుంచి అందిన ప్రతిపాదనల ప్రకారం, 40,000 మెట్రిక్ టన్నుల పప్పుధాన్యాలను మద్దతు ధర పథకం (పిఎస్ఎస్) కింద 2021-22 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో సేకరణకు అనుమతి ఇవ్వడం జరిగింది. ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలనుంచి ప్రతిపాదనలు అందినవెంటనే పప్పుధాన్యాలు, చమురుగింజలు, కొబ్బరిని మద్దతు ధరకింద అనుమతులు ఇవ్వడం జరుగుతుంది. దీనివల్ల ఎఫ్.ఎ.క్యు గ్రేడ్ కు చెందిన ఈ పంటల మార్కెట్‌ధర 2021-22 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో, ఎం.ఎస్.పి కంటే తగ్గితే వాటిని రిజిస్టర్ రైతులనుంచి ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో నోటిఫై చేసిన పంట కాలంలో సెంట్రల్ నోడల్ ఏజెన్సీలు రాష్ట్రాలు నామినేట్ చేసే ప్రొక్యూర్ ఏజెన్సీల ద్వారా గత ఏడాది సేకరించినట్టుగా నేరుగా సేకరించడానికి వీలు కలుగుతుంది.

2021-22 సీజన్‌కు సంబంధించి తమిళనాడు నుంచి 51,000 మెట్రిక్ టన్నుల కొబ్బరి సేకరణకు అనుమతి ఇవ్వడం జరిగింది. 2021 సెప్టెంబర్ 5 వ తేదీ నాటికి 8.30 మెట్రిక్ టన్నులు 0.09 కోట్ల రూపాయల వ్యయంతో తమిళనాడులో సేకరించడం జరిగింది. దీనివల్ల తమిళనాడులోని 36 మంది రైతులకు ప్రయోజనం కలిగింది.

సంబంధిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2021-22 కుసంబంధించి పప్పుధాన్యాలు, చమురుగింజల పంట సేకరణకు ఆయా రాష్ట్రాలు నిర్ణయించిన తేదీనుంచి సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నాయి.

కరీంనగర్ వరదలకు కారణం ఏమిటో?

కరీంనగర్ సెప్టెంబర్ 7:(నేటినిజం ప్రతినిధి): : నగరంలో ప్రతీ ప్రాంతంలో నిలిచిపోయిన వరద నీటిని గంటన్నరలోపు వివిధ మార్గాల ద్వారా మళ్లించే విధంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుందని మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. గత వారం రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రభావితమైన కరీంనగర్ టౌన్, పరిసర లోతట్టు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం పర్యటించారు. నడుము లోతు నీటితో నిండిన కాలనీల్లోనూ పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మనగర్, రేకుర్తి, రాంనగర్ తదితర ఏరియాల్లో రోడ్డు పనులు నడుస్తున్నందున నీరు నిలిచిపోయిందన్నారు.

శాతవాహన యూనివర్సిటీతో పాటు ఓపెన్ ఏరియాల్లో వరదను 394 కాలువలోకి మళ్లించినట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, అందరూ క్షేత్రస్థాయిలోనే ఉన్నారన్నారు. మున్సిపల్ సిబ్బంది మొదలు, రెవెన్యూ, ఇరిగేషన్, వాటర్ వర్క్స్, పోలీస్ శాఖతో సహా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలతో ఇప్పటివరకూ ప్రాణనష్టం జరుగలేదని తెలిపారు. అక్కడక్కడ కొంత ఆస్తినష్టం జరిగిందన్నారు. గతంలో గ్రౌండ్ వాటర్ ఎక్కువగా లేకపోవడంతో వర్షాలు కురిసిన సమయంలో ఆ నీరు భూమిలోకి ఇంకి భూగర్భజలాలు పెరిగేవన్నారు.

కాళేశ్వరంతో గత సీజన్ నుంచి అన్ని జలాశయాలు నిండుకుండలా మారి గ్రౌండ్ వాటర్ లెవల్ ఇప్పటికే పెరిగాయన్నారు. దీంతో చిన్న వర్షాలకే వరదలు వస్తున్నాయన్నారు. వీటిని ఎక్కడికక్కడ మానేరులోకి మళ్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మానేరు జలాశయం సైతం నిండి గేట్లు తెరుచుకున్నాయన్నారు. విపత్తులు చెప్పి రావు, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందుల్ని సాధ్యమైనంత త్వరగా తొలగిస్తామని, ప్రజలు సైతం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు.

గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఐఆర్ ఇడిఎకు మద్దతునందించనున్న టిఎఇన్‌జిఇడిసిఎ; ఎంఒయుపై సంతకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:పునరావృత ఇంధన ప్రాజెక్టులను అభివృద్ధి చేయడంలో, నిధుల సేకరణలో తన సాంకేతిక నైపుణ్యాన్ని అందించేందుకు ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లిమిటెడ్ (ఐఆర్ ఇడిఎ - భారతీయ పునరావృత ఇంధన అభివృద్ధి ఏజెన్సీ లిమిటెడ్) సోమవారం తమిళనాడు జనరేషన్ ఏ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిఎఎన్‌జిఇడిసిఎ)తో అవగాహనా ఒప్పందంపై (ఎంఒయు) సంతకాలు చేసింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, ఇతర ప్రముఖుల సమక్షంలో ఐఆర్ ఇడిఎ చైర్మన్ ఏ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) ప్రదీప్ కుమార్ దాస్, టిఎఎన్‌జిఇడిసిఎ సిఎండి రాజేష్ లఖోనీ అవగాహన పత్రంపై సంతకాలు చేశారు.

ఎంఒయు కింద టిఎఎన్‌జిఇడిసిఎకి పునరావృత ఇంధన ప్రాజెక్టు అభివృద్ధి కోసం, బిడ్ ప్రక్రియల నిర్వహణ, అమలు తోడ్పాటుకు సంబంధించి సాంకేతిక నైపుణ్యాలను ఐఆర్ ఇడిఎ అందిస్తుంది. అంతేకాకుండా, ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేయడం ద్వారా టిఎఎన్‌జిఇడిసిఎ రుణ సేకరణకు, మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్ అవగాహనలో తోడ్పాటు, ప్రతిపాదిత రుణ అవసరాలకు సంబంధించిన లిఖిత సేవలు, ప్రీ మార్కెట్ సర్వేల నిర్వహణ, భవిష్య పెట్టుబడిదారులలో ఆసక్తిని పెంపొందించేందుకు రోడ్ షోలను నిర్వహించడంలో ఐఆర్ ఇడిఎ మద్దతును అందించనుంది,

సమర్థవంతమైన పునరావృత ఇంధన ఏకీకరణ కోసం టిఎఎన్‌జిఇడిసిఎ తగిన బ్యాటరీ స్టోరేజీతో 20,000 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును, 3,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టును, 2,000 మెగావాట్ల గ్యాస్ ఆధారిత పవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పైన పేర్కొన్న ప్రాజెక్టులను అంచనా వేసిన రుణం దాదాపు రూ. 1,32, 500 కోట్లు అవసరం అవుతాయి. పునరావృత ఇంధన రంగంలో నాయకత్వం వహిస్తున్న ఐఆర్ ఇడిఎ , పునరావృత ఇంధన ప్రాజెక్టుల ఆర్థిక అవసరాలను నెరవేర్చడంలో ముఖ్య పాత్ర పోషించేందుకు కట్టుబడి ఉంది.

ఆపదలో అండగా సీఎం సహాయనిధి : విప్ ఆరెకపూడి గాంధీ

హైదరాబాద్ , సెప్టెంబర్ 7:ప్రజలకు ఎటువంటి ఆపద వచ్చినా ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, సీఎం సహాయ నిధి ద్వారా భరోసాను కల్పిస్తుందని ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ అన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా తమ ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తున్నదన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గవ్యాప్తంగా ఆయా డివిజన్‌లకు చెందిన 36 మంది బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి పథకం ద్వారా మంజూరైన రూ. 22.40 లక్షల ఆర్థిక సాయం చెక్కులను కార్పొరేటర్లు రోజాదేవి, వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి విప్ ఆరెకపూడి గాంధీ మంగళవారం వివేకానందనగర్‌లోని తన నివాసంలో లబ్దిదారులకు అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం తన నిరంతర సేవల ద్వారా వేలాది మంది పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నదన్నారు. ఆర్థిక స్థోమత లేక అనారోగ్యాల బారిన పడుతున్న పేదలు ఈ సహాయంతో కార్పొరేట్ వైద్యాలతో తమ ఆరోగ్యాలకు స్వస్థతను పొందారన్నారు. ఆపదలో అపన్నహస్తంలా బాధితులకు అండగా సీఎం సహాయ నిధి ఉపయుక్తమవుతుందని విప్ ఆరెకపూడి గాంధీ అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సంజీవరెడ్డి, రఘునాథ్ రెడ్డి, శ్రీనివాస్యాదవ్, జిల్లా గణేశ్,వాలా హరీష్, నాయినేని చంద్రకాంత్‌రావు, దామోదర్‌రెడ్డి, కొండల రెడ్డి,కాశీనాథ్, రాజేందర్,సైదేశ్వర్‌రావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

జన్మనిచ్చేది తల్లి , జీవితానికి దారి చూపేది గురువు..!

-రాష్ట్ర శాసన మండలి ప్రొటెమ్ చైర్మన్ వి. భూపాల్ రెడ్డి.

సంగారెడ్డి, సెప్టెంబర్ 7(నేటినిజం ప్రతినిధి) జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, జెడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి లతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి, మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గురువు బోధించే చదువుతోనే ప్రయోజకులు అవుతారని, తమ జీవితాలను తీర్చిదిద్దుకుంటారని అన్నారు.పిల్లలు జీవితంలో సరైన దారిలో వెళ్లడానికి తల్లిదండ్రుల తర్వాత గురువులదే ప్రధాన పాత్ర అని ఆయన అభిప్రాయపడ్డారు. మరిచిపోలేనిది విద్య ఒక్కటేనని, విద్యనందించే గురువు గొప్పతనం గురించి ఆయన కొనియాడారు. తాను ఉన్నత స్థితికి రావడానికి తనకు చదువు చెప్పిన గురువు లేనని, చదువు మీద ఉండే ఆసక్తిని, గురువుల మీద ఉండే భక్తిని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఉపాధ్యాయులు మంచి భావిపౌరులను తయారు చేసి రాష్ట్రానికి, దేశానికి అందించాలని కోరారు.

జిల్లాలో ఉన్న పాఠశాలలన్నింటిని మరింత అభివృద్ధి దిశకు తీసుకెళ్లేలా ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తికి ఉన్న గౌరవం అమోఘమైనదన్నారు. తనకు చదువు చెప్పిన గురువులు అందరికీ పేరుపేరునా పాదాభివందనాలు చేస్తున్నానన్నారు. మంచి ఆలోచన విధానాన్ని రూపొందించుకునే లా విద్యార్థులను సరైన మార్గంలో నడిపించేది ఉపాధ్యాయులే నన్నారు. సమాజానికి మంచి పౌరులను అందించాలని కోరారు. వృత్తి గౌరవాన్ని, విలువలను పెంచే విధంగా ఉపాధ్యాయులు అందరూ పనిచేయాలని ఆయన కోరారు.

జెడ్పి చైర్ పర్సన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ తల్లి లేని పిల్ల వాడు ఉంటాడు కానీ, గురువు లేని విద్యార్థి ఉండడని అన్నారు. గురువు కున్న స్థానం ఎంతో గొప్పదని, జాతి గర్వించే ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దేది ఉపాధ్యాయులన్నారు. సమాజాభివృద్ధికి తొలిమెట్టు పాఠశాల నుండి ప్రారంభం అవుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని, ఏమి ఇచ్చినా ఉపాధ్యాయుల రుణం తీర్చుకోలేనిదని ఆమె పేర్కొన్నారు.

అదనపు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖమైనదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, ఉపాధ్యాయుల కృషి వల్లే ఏ వ్యక్తి అయినా తాననుకున్న ఉన్నత స్థితికి చేరుతారని అన్నారు. పిల్లల విషయంలో ఉపాధ్యాయులు ఒక ఫిలాసఫర్ గా, గైడ్ గా, స్నేహితులుగా , మార్గదర్శకులుగా నిలిచి ఎక్కువ బాధ్యతలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకోవాలని, పిల్లల అభిరుచికి తగ్గట్టుగా వారిని ప్రోత్సహించాలన్నారు.

అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ ఒక వ్యక్తి ఉన్నతమైన స్థానంలో నిలిచాడంటే దాని వెనక ఉపాధ్యాయుల పాత్ర ప్రధానమైనదన్నారు. ఏ స్థాయిలో ఉన్న వ్యక్తి అయినా గురువు బోధించిన విద్య వల్లే ఉన్నత స్థితికి వెళ్లారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. వృత్తి సంతృప్తినిచ్చే ఉద్యోగం ఉపాధ్యాయ వృత్తి అని ఆయన పేర్కొన్నారు. తాను ఆరు సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పని చేశానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ పురస్కారం ఉపాధ్యాయ లోకానికి అంతటికి చేసే సత్కారంగా భావించాల న్నారు. విద్యను మించిన ధనం లేదని విద్యతోనే అన్ని సమకూరుతాయన్నారు. ఒకటిన్నర సంవత్సరాల నుండి పాఠశాలలు పని చేయడం లేదని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి బోధించాలని కోరారు.

అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన (66)మంది ఉపాధ్యాయులకు శాసనమండలి ప్రొటెం చైర్మన్, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు, జెడ్పి చైర్ పర్సన్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు.

అంతకుముందు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో డిఈ ఓ రాజేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఐ ఓ గోవిందరావు, డిసిఎంఎస్ చైర్మన్ శివ కుమార్, జిల్లా సైన్స్ అధికారి విజయ్ కుమార్,ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎం ఈ ఓ లు, పురస్కార గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు పోటెత్తిన వరద.. మూసీ గేట్లు ఎత్తివేత

హైదరాబాద్ , సెప్టెంబర్ 7:తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాను వర్షాలు ముంచెత్తుతున్నాయి. జిల్లా పరిధిలోని అన్ని ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. మూసీ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. దీంతో ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తి దిగువకు 7 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 8,470 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 7,223 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 3.26 టీఎంసీలుగా ఉంది.

మరోవైపు జూరాల ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు 12 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. జూరాల ఇన్ ఫ్లో 1,05,281 టీఎంసీలుగా ఉండగా, ఔట్ ఫ్లో 1,07,036 క్యూసెక్కులుగా కొనసాగుతుంది. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.51 మీటర్లుగా ఉండగా, ప్రస్తుతం 317.60 మీటర్లుగా ఉంది. జూరాల పూర్తిస్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.836 టీఎంసీలుగా ఉంది.

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద ఉధృతి అధికంగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు కాగా?ప్రస్తుత నీటిమట్టం 587.50 అడుగులకు చేరింది. ఇన్ ఫ్లో 17,062 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 16,372 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి సామర్థ్యం 312.0450 టీఎంసీలకు గాను ప్రస్తుతం నీటి నిలువ 305.8030 టీఎంసీలుగా కొనసాగుతోంది.



ఆర్టీపీసీఆర్ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7: జిల్లా అభివృద్ధిలో అధికారులు మరింత ప్రభావశీలంగా పనిచేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి వీ.శ్రీనివాస్ గౌడ్ అన్నారు.మహబూబ్‌నగర్ వైద్య కళాశాలలో ఆర్టీపీసీఆర్ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురైతే రాత్రి 2:30 గంటల ప్రాంతంలో తాను మహబూబ్‌నగర్‌లో ద్విచక్ర వాహనంపై పర్యటించినట్లు తెలిపారు.

దూద్ దవాఖాన స్థానంలో నిర్మాణం అవుతోన్న నూతన దవాఖాన నిర్మాణ పనుల్ని 2నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు రైతులకు ట్రాన్స్ ఫార్మర్లను వెంటనే అందించాలని ఆదేశించారు. రూ. 120కోట్ల వ్యయంతో 6 మైనారిటీ గురుకులాలను వీరన్నపేట్ ప్రాంతంలో ఒకే ప్రాంగణంలో నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ దవాఖానలో వైద్య పరీక్షలు ఉచితంగానే నిర్వహిస్తున్నామని తెలిపే హోర్డింగ్ లను ఏర్పాటు చేయాలని సూచించారు.

జడ్చర్ల నుంచి మహబూబ్ నగర్ వరకు ప్లాంటేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అటవీ శాఖా అధికారులను ఆదేశించారు. గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాయాల్లో మిగిలిపోయిన సీట్ల వివరాలను ఎప్పటికప్పుడు తనకు అందించాలన్నారు. మిగిలిపోయిన సీట్లకు చాలా మంది అర్హులైన పేద విద్యార్థులకు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల రుణాల ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరపలన్నారు. అధికారులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నా తన దృష్టికి తీసుకువస్తే, వాటిని పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమీకృత కలెక్టర్ కార్యాలయం ప్రారంభించడానికి సీఎం కేసీఆర్ వచ్చేకంటే ముందే రహదారుల సుందరీకరణ పూర్తి చేయాలన్నారు.

అధికారులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ యస్.వెంకట్రావు, ఎస్పీ వెంకటేశ్వర్లు, అడిషనల్ కలెక్టర్లు తేజస్ నందలాల్ పవార్, సీతారాం, డీఆర్వో స్వర్ణలత, వైద్యకళాశాల డైరెక్టర్ పుట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్‌ను కలిసిన కేంద్ర మంత్రి డా.ఎల్ మురుగన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:కేంద్ర సమాచార, ప్రసార మరియు మత్స్యశాఖ, పశుసంవర్ధక ఉ పాడిపరిశ్రమ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా డా.ఎల్ మురుగన్ రైల్వే మంత్రిని ఈరోడ్ నుండి ధారాపురం మీదుగా పళని వరకు కొత్త బ్రాడ్-గేజ్ రైల్వే లైన్ అవశ్యకత గురించి చర్చించారు. బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలన్నది ధరాపురం ప్రజల దీర్ఘకాల డిమాండ్. ఈ బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ నిర్మాణం వల్ల స్థానిక ప్రజల సర్వతోముఖాభివృద్ధికి, వ్యవసాయ-ఆర్థిక వ్యవస్థను పెంచేందుకు దోహదం చేస్తుందన్నది ఇక్కడి ప్రజల కోరుతూ వస్తున్నారు. ఈ సమావేశం సందర్భంగా డాక్టర్ మురుగన్ వారణాసి నుండి కాంచీపురం మీదుగా రామేశ్వరం వరకు సాధారణ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును ప్రారంభించాలని అభ్యర్థించారు. దేశీయ పర్యాటకాన్ని పెంపొందించడానికి వారసత్వ నగరం కాంచీపురాన్ని రామాయణ్ సర్క్యూట్‌తో అనుసంధానించడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. శ్రీ. సమావేశంలో భాగంగా హాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ చేసిన రెండు ప్రతిపాదనలపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వివరణాత్మక ఆలోచన చేశారు. తమిళనాడులో రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధి మరియు అధునికీకరణకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా పోలీస్ యంత్రాగాన్ని అప్రమత్తం చేసి క్షేత్ర స్థాయిలో సహాయక చర్యలు చేపట్టిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

-జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకున్న 46 కుటుంబాలను కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలింపు.

-వరదనీటిలో చిక్కుకున్న గర్భిణీ మహిళను కాపాడి ఆస్పత్రికి తరలించిన పోలీసు బృందం

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 7:(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో గత రెండు మూడు రోజుల నుండి కురుస్తున్న అతి బారి వర్షానికి సిరిసిల్ల పట్టంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి.జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే జిల్లా పోలీస్ యంతరంగాన్ని అప్రమత్తం చేసి క్షేత్ర స్థాయిలో సహాయక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా జిల్లా పోలీస్ అధికారులతో లోతట్టు ప్రాంతాలను అలాగే శాంతినగర్,వెంకంపెట్ రోడ్,బి.వై నగర్,సుందరయ్య నాగర్ పాత బస్టాండ్ ప్రాంతలనుపరిశీలించారు.జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకున్న 46 కుటుంబాలను కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగింది అని అన్నారు.పాత బస్టాండ్ ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న గర్భిణీ మహిళని జె.సి.బి ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది అని అ అలాగే వృద్ధులకు,చిన్నారులకు జె?సీబి ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందని అన్నారు .ప్రజలు కూడా అనవసరంగా బయటకు రాకూడదని పోలీస్ వారికి సహకరించాలని అన్నారు.ఏమైనా సంఘటనలు జరిగితే మీ పరిధిలోని పోలీసులకు కానీ డయల్ 100 కానీ సమాచారం అందించినచొ తక్షణ సహాయక రక్షణ చర్యలు చేపడుతం అని ఎస్పీ అన్నారు..సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయంతో టీం లుగా ఏర్పడి కలసి పని చేస్తున్నాం అనిఅన్నారు..ఎవరూ కూడా నీటి ప్రవాహాలు దగ్గరికి ఫోటోలు, సెల్ఫీల కోసం చేపల పట్టడం కోసం వెళ్లకూడదని వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని హెచ్చరించారుఎస్పీ వెంట డిఎస్పీ చంద్రశేఖర్ సి.ఐ లు ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

తెరాస సంస్థాగత నిర్మాణం పటిష్టం చేయడంలో ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలి

-వేములవాడ నియోజకవర్గం అభివృద్ధిలో ముందుంది.

-12 తేదిలోపు టీఆర్ఎస్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకుందాం!

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 7:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ సంస్థాగత నిర్మాణం పటిష్టం చేయడం లో ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు అన్నారు .

మంగళవారం వేములవాడ పట్టణంలోని సంగీత నిలయంలో ముఖ్య నాయకుల, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ కార్యదర్శి కర్రశ్రీహరి పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తరుణంలో అడుగడుగునా అభివృద్ధి చెందుతుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో వేములవాడ నియోజకవర్గన్నీ మరింత అభివృద్ధి చేసుకుంటున్నామని అన్నారు. 12 తేదిలోపు పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మండల కమిటీ త్వరలో నిర్ణయిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో కార్యకర్తలు సభ్యత్వ నమోదులో నిఖార్సుగా పని చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో మనం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుకుంటున్నామని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అత్యంత అభివృద్ధి దిశగా ముందుగా వెళ్తుందని , అవగాహన లేక కొంత మంది నేతలు అభివృద్ధి పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. మెట్టప్రాంతగా ఉన్న వేములవాడలో ప్రతి ఎకరాకు నీరు అందిస్తామని తెలిపారు. లక్ష ఎకరాల సాగు నిర్దేశంలో 55 వేల ఎకరాలకు నీరందించామని, కలికోట సూరమ్మ చెరువు-వరద కాలువ ద్వారా మెడిపల్లి, కథలాపూర్ మండలాలలో 45 వేల ఎకరాలకు నీరందిస్తామని త్వరలో సీ.ఎం.కేసీఆర్ గారి ఆమోద ప్రకటనప్రఅనున్నదన్నారు. పార్టీకి బలం కార్యకర్తలే అని కొనియాడారు.

అనంతరం నియోజకవర్గ సభ్యత్వ ఇంచార్జి మరియు పార్టీ కార్యదర్శి కర్ర శ్రీహరి గారు మాట్లాడుతూ నూతన కమిటీలు త్వరగా పూర్తి చేయాలని కార్యకర్తలే పార్టీకి పునాది అని చిన్న చిన్న అంతర్గత సమస్యలు ఉంటే పరిష్కరించుకుందాం అని అన్నారు.

కమిటీలో కుల, వర్గ ప్రాతిపదికన సభ్యులను నియమించాలని సూచించారు. రాష్ట్రంలో జరుగుచున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రాజు గారు, జెడ్.పీ.టీ.సీకు, ఎం.పీ.పీలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు, పాక్స్ చైర్మన్స్, డైరెక్టర్స్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్లకు బయలుదేరిన డీఆర్ఎఫ్ బృందాలు

హైదరాబాద్ , సెప్టెంబర్ 7: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భారీగా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో వరద నీరు పోటెత్తింది. కరీంనగర్ ? కామారెడ్డి రహదారితో పాటు వెంకంపేట రోడ్‌పై వరద ప్రవహిస్తోంది. పలు కాలనీలు నీటమునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలో వరద పరిస్థితిపై రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ వర్షాల దృష్ట్యా రాజన్న సిరిసిల్లకు డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్లు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు రెండు బృందాలు హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు బయలుదేరి వెళ్లాయి. ఈ బృందాలు వరద సహాయక చర్యలు చేపట్టనున్నాయి.

కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్‌లతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి కేటీఆర్ వరదల దృష్ట్యా సహాయక చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా యంత్రాగాన్ని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. వరద ముంపునకు గురైన ప్రజలను పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తరలించాలని సూచించారు. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, అన్ని విధాలుగా సహాయక చర్యలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇవాళ ఉదయం 8.30 గంటల వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో అత్యధికంగా వేములవాడలో 213 మిల్లీమీటర్లు, సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 174 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది టీఎస్‌డీపీఎస్ తెలిపింది.

బ్రిడ్జి కుంగిపోవడం టిఆర్ఎస్ వైఫల్యం కాదా..?

-కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి ఆరోపణ

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 7:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని బ్రిడ్జి నిర్మాణం మూడు సార్లు మూడు సంవత్సరాల నుండి వానకాలం కుంగి పోవడం జరుగుతుంది దీనికి పూర్తి బాధ్యత టిఆర్ఎస్ పార్టీ వైఫల్యం కాదా స్థానిక ఎమ్మెల్యే అధికార పార్టీలో ఉండి ఏం చేస్తున్నారని కాంట్రాక్టర్లకు పైసలు ఇవ్వడం లేదా లేక వేములవాడ పట్టణ ప్రజలు దేవస్థానం వచ్చే లక్షలాది భక్తులకు సౌకర్యం ఉండదన దీని ఉద్దేశం ఏంది అని వేములవాడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ ఇప్పటికైనా అధికార పార్టీ పట్టించుకోని దీనిని పూర్తి చేసి పట్టణ ప్రజలకు సౌకర్యాలు అర్థం తగు చర్యలు తీసుకోవాలని ఇకముందు ఇలాంటి జరుగుతే కాంగ్రెస్ పార్టీ తరఫున పట్టణ ప్రజల తరఫున ఆందోళన చేస్తామని డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమాలలో పాత సత్య లక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి నాగుల విష్ణు ప్రసాద్ నాగుల రాము చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ కనుక రేపు రాకేష్ నాగులో రవీందర్ గౌడ్ నరేష్ అక్కున్న పెల్లి నరేష్ పోతుగంటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు

గుడ్డి నిర్ణయాలొద్దు.. నీట్‌ను వాయిదా వేయండి..!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:దేశవ్యాప్తంగా వచ్చే ఆదివారం నిర్వహించతలపెట్టిన నీట్ పరీక్షను వాయిదా వేయాలని కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఒత్తిడిని పట్టించుకోకుండా ప్రభుత్వం గుడ్డిగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం అనాలోచితంగా చేస్తున్న గుడ్డి నిర్ణయాలతో విద్యార్థులు ఫెయిర్‌గా పరీక్ష రాసే పరిస్థితి లేకుండా పోయిందని, వారు ఒత్తిడికి లోనవుతున్నారని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

ఈ నెల 12న (ఆదివారం) నిర్వహించతలపెట్టిన నీట్ పరీక్షను వాయిదా వేయాలంటూ దాఖలైన పిటిషన్లపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం పిటిషనర్‌ల అభ్యర్థనను తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. అదేరోజు 12వ తరగతి ఇంప్రూవ్‌మెంట్/కంపార్ట్‌మెంట్ పరీక్షలు ఉన్నందున నీట్‌ను వాయిదావేయాలని పలువురు కోరగా న్యాయస్థానం అందుకు అంగీకరించలేదు. నీట్ జాతీయ స్థాయి పరీక్ష కావడంతో దాంట్లో జోక్యం చేసుకోవడం సబబు కాదని, ఒక్కశాతం మంది కోసం మొత్తం వ్యవస్థను ఆపలేమని కోర్టు అభిప్రాయపడింది.

ఈ పరిణామాల నేపథ్యంలో ఇవాళ ట్విట్టర్ వేదికగా రాహుల్ గాంధీ స్పందించారు. నీట్ పరీక్ష నిర్వహించేందుకు సిద్ధమైన కేంద్రంపై విమర్శలు గుప్పించారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో విద్యార్థులపై పడుతున్న ఒత్తిడిని ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, నీట్‌ను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయమైన అవకాశం కల్పించాలని ట్వీట్ చేశారు.

ఏపీలో ఆగని కరోనా ఉధృతి.. కొత్తగా 1,178 కేసులు

అమరావతి, సెప్టెంబర్ 7:ఆంధ్రప్రదేశ్ లో కరోనా కేసులు తగ్గుతున్నాయి. రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో 54,970 సాంపిల్స్ ని పరీక్షించగా.. 1,178 మందికి కోవిడ్ పాజిటివ్ గా నిర్ధారణ అయింది. మరో 10 మంది మరణించారు. మొత్తం 1,266 మంది కోవిడ్ నుంచి పూర్తిగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు అయ్యారు. చిత్తూరు జిల్లాలో 204, నెల్లూరు జిల్లాలో 177, కృష్ణా జిల్లాలో 151, గుంటూరు జిల్లాలో 135 కరోనా కేసులు నమోదు అయ్యాయి. కోవిడ్ వల్ల కృష్ణా, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఇద్దరు చొప్పున మృతి చెందగా.. చిత్తూరు, తూర్పు గోదావరి, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాత పడ్డారు.

ఇప్పటి వరకు రాష్ట్రంలో నమోదైన కేసుల సంఖ్య 2023242కి చేరింది. ఇందులో 19,94855 మంది కోలుకున్నారు. ప్రస్తుతం 14,452 యాక్టివ్ కేసులు ఉండగా.. ఇప్పటి వరకు మొత్తం 13,935 మంది వైరస్ కు బలైయ్యారు. నేటి వరకు రాష్ట్రంలో 2,70,37,651 సాంపిల్స్ పరీక్షించినట్లు వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది

ప్రచురణల విభాగానికి అవార్డుల పంట

హైదరాబాద్ , సెప్టెంబర్ 7:కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రచురణల విభాగానికి, ప్రచురణల్లో ఉన్నత ప్రమాణాలకు గాను 2021 సంవత్సరానికి పది (10) అవార్డులు వచ్చాయి. జెనీవాలోని అంతర్జాతీయ పబ్లిషర్ల అసోసియేషన్ కు అనుబంధ సంస్థ అయిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పబ్లిషర్స్, ఈ అవార్డులను ప్రకటించింది. కాఫీ టేబుల్ బుక్స్, జర్నల్స్, పిల్లల సాహిత్యం కేటగిరీలలో ఈ అవార్డులు లభించాయి. ఆర్థిక సర్వే 2021, కోర్ట్ ఆఫ్ ఇండియా, యోజన (పంజాబీ) వివిధ కేటగిరీల్లో ప్రథమ బహుమతి పొందగా, మహాత్మా గాంధీ-లైఫ్ త్రూ లెన్సెస్, రాష్ట్రపతి శ్రీ రామ్ నాథ్ కోవింద్ ప్రసంగాల సంకలనం 'లోక్ తంత్ర్ కేన్వర్' రెండవ బహుమతి పొందాయి. గ్రామీణాభివృద్ధి అంశాలపై ప్రచురించే 'కురుక్షేత్ర' పుస్తకాల కేటలాగ్ మూడవ బహుమతి పొందాయి.

ఈ అవార్డులను న్యూ ఢిల్లీలో సెప్టెంబర్ 17న అందజేస్తారు.

బంగ్లాదేశ్ సమాచార , ప్రసార మంత్రి డా. హసన్ మహమూద్ ని కలిసిన శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:బంగ్లాదేశ్ సమాచార , ప్రసార మంత్రి డా. హసన్ మహమూద్ నాయకత్వంలో వచ్చిన దేశ ప్రతినిధి బృందంతో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ రెండు దేశాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య ప్రసార, సమాచార రంగంలో సంబంధాలను మరింత బలోపేతం చేయడం, రెండు దేశాల ప్రజల మధ్య బంధాలను పటిష్టం చేయడం, రెండు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను మెరుగు పరచడం లాంటి అంశాలపై మంత్రులు చర్చలు జరిపారు. రెండు దేశాలకు ఆసక్తి కలిగిన అంశాలను చర్చించి తమకు సహకరించడానికి ముందుకు వచ్చిన భారతదేశానికి బంగ్లాదేశ్ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. 2021 మార్చి నెలలో భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ తమ దేశంలో పర్యటించిన అంశాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

2. షేక్ ముజీబుర్ రహమాన్ జీవితం , ఆనాటి సంఘటనల ఆధారంగా నిర్మిసున్న "బంగబంధు" చిత్ర నిర్మాణంపై . శ్రీ అనురాగ్ ఠాకూర్ సంతృప్తి వ్యక్తం చేసారు. "నిర్మాణంలో ఎక్కువ చాలా భాగం పూర్తయింది. పరిస్థితులు అనుకూలిస్తే 2022 మార్చి నాటికి పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. చిత్రాన్ని 2022 మార్చిలో అంతర్జాతీయంగా విడుదల చేయవచ్చు "అని శ్రీ అనురాగ్ ఠాకూర్ అన్నారు.

3. " లిబరేషన్ ఆఫ్ బంగ్లాదేశ్ ఇన్ 1971" అనే డాక్యుమెంటరీ చిత్ర నిర్మాణాన్ని కొనసాగించాలని రెండు దేశాలు అంగీకరించాయి. కొనసాగించడానికి కూడా అంగీకరించబడింది. డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, పరస్పర మార్పిడి ద్వారా ఒక దేశంలో నిర్మించిన చిత్రాలను దేశంలో ప్రదర్శించడం వంటి అంశాలలో రెండు దేశాల మధ్య సంబంధాల మరింత బలోపేతం చేసే అంశాలపై కూడా చర్చలు జరిగాయి.

4. 2021 డిసెంబర్ 6 న "మైత్రి దివస్" వేడుకను నిర్వహించే అంశంపై రెండు దేశాల మంత్రులు చర్చించారు. దీని కోసం రెండు దేశాలకు ఆమోదయోగ్యమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని నిర్ణయించారు. 2021 నవంబర్‌లో గోవాలో జరగనున్న 52 వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో పాల్గొనాలని బంగ్లాదేశ్ ని శ్రీ ఠాకూర్ ఆహ్వానించారు. 2021 జనవరి లో జరిగిన 51 వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో పాల్గొన్న బాంగ్లాదేశ్ కు శ్రీ ఠాకూర్ కృతజ్ఞతలు తెలిపారు. సాంస్కృతిక, ప్రజా సంబంధాలను మరింత మెరుగు పరచేందుకు చర్యలు తీసుకోవడానికి రెండు దేశాల మంత్రులు అంగీకరించారు.

వర్షం, వరదల వల్ల నష్ట పోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం!

-అధికారులు అప్రమత్తంగా ఉండండి-శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 7:(నేటినిజం ప్రతినిధి): నేడు శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షానికి దెబ్బతిన్న కుటుంబాలను, రోడ్లను మున్సిపల్ చైర్మన్ మాధవి రాజు తో కలిసి షాట్రాజెపల్లి రోడ్డును, క్షవరాల కాలనీని, మల్లారం రోడ్ ను, చెక్కపల్లి రోడ్డులో గల బ్రిడ్జి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండురోజుల నుండి పడుతున్న తీవ్ర వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు ముంపు గురైనందున వారికి దేవస్థానం నందు పునరావాస ఏర్పాట్లు చేసే విధంగా అధికారులతో మాట్లాడారు. అవసరమైన చోట్ల రిటైనింగ్ వాల్స్ నిర్మించి భవిషత్తులో వచ్చే వరదుకు ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా శాశ్వతంగా నిర్మించాలని అధికారులకు సూచించారు. నష్ట పోయిన వారికి భోజన వసతి కూడా ఏర్పాటు చేయాలని ఆలయ ఈ. ఓ గారికి సూచించారు. అలాగే ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని ధైర్యంగా ఉండాలని ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల పరిస్థితులు పర్యవేక్షిస్తూ వారికి సౌకర్యాలు, భద్రత కల్పించాలని అధికారులకు సూచించారు.

ఎమ్మెల్యే వెంట ఏ.ఎం.సి చైర్మన్ గడ్డం హనుమాండ్లు , మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ , కౌన్సిలర్లు నరాల శేఖర్, యాచ మినేని శ్రీనివాసరావు, గోలి మహేష్ ఇప్పపూల అజయ్,కొప్పుల్ మెంబర్ లు కట్కూరి శ్రీనివాస్ సర్పర్ బాబున్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, నాయకు లు రాఘవ రెడ్డి, జడల శ్రీనివాస్, నీలం శేఖర్, రాజు అధికారులు తదితరులు పాల్గొన్నారు.





Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.